


నేటి దర్శిని తెలుగు దిన పత్రిక లో ప్రకటనల కోసం సంప్రదించగలరు.
సెల్ : 94920 33365



# నేటి దర్శిని

WWW.NETIDARSHINI.COM

RNI NO: TGTEL/25/A0471

తెలుగు దిన పత్రిక

సత్య శోధనే మా లక్ష్యం...


రంగారెడ్డి బుధవారం 25-03-2026 సంపుటి: 01 సంచిక : 278 వేల: 2 రూ పేజీలు :08 సంపాదకులు: కట్ట హిమ పావని

Ranga Reddy Wednesday 25-03-2026 Volume :01 Issue: 278 Cost: 2 Pages:08 Editor : Katta HimaPavani



రిపోర్టర్లు కావలెను

జర్నలిజంలో ఆసక్తి ఉన్నవారికి నేటి దర్శిని ఆహ్వానం పలుకుతుంది. తెలుగు రాష్ట్రాలలో జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయిల్లో రిపోర్టర్లుగా పని చేయుటకు ఆసక్తి, అనుభవం ఉన్నవారు ఈ క్రింది నంబర్లకు కాల్ చేసి సంప్రదించగలరు.



Contact Number
9059328777


### జర్నలిస్టుల సమస్యలపై మండలి లో

# గళమెత్తిన ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి

## నెరా రాష్ట్ర కమిటీ సభ్యులతో ఎమ్మెల్సీ క్వార్టర్స్ లో మర్యాదపూర్వక భేటీ

- వృత్తి సమస్యలు సంక్షేమ అంశాలపై సుదీర్ఘ చర్చ
- మహిళా జర్నలిస్టులకు 33 శాతం రిజర్వేషన్ ప్రతిపాదన
- ప్రభుత్వానికి సమగ్ర నివేదిక అందించాలని నెరాకు ఎమ్మెల్సీ సూచన
- సమస్యల పరిష్కారానికి మంత్రి స్థాయిలో చర్చల హామీ
- జర్నలిస్టుల సంక్షేమానికి నిరంతర కృషి కొనసాగుతుంది. -నెరా





**హైదరాబాద్, మార్చి 24 (నేటి దర్శిని):**
ఈ నెల 18న శాసనమండలిలో సుమారు ఆరు నిమిషాల పాటు మాట్లాడిన తక్కెళ్లపల్లి రవీందర్ రావు జర్నలిస్టుల వాస్తవ పరిస్థితులను ప్రతిబింబించేలా తమ అభిప్రాయాలను వెల్లడించారు. సమాజానికి కళ్లుగా, చెవులుగా పనిచేసే జర్నలిస్టులకు తగిన గుర్తింపు లేకపోవడం, భద్రతా లోపాలు, ఆర్థిక అస్థిరత వంటి అంశాలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని పేర్కొన్నారు. రోజంతా, రాత్రంతా ప్రజా సమస్యలపై పరుగులు తీస్తూ పని చేసే ఈ వృత్తిదారుల వేతనాలు తక్కువగా ఉండటం, కుటుంబ పోషణలో ఇబ్బందులు ఎదుర్కొవడం వంటి అంశాలను ఆయన గంభీరంగా ప్రస్తావించారు. జర్నలిస్టులు ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా కీలక పాత్ర పోషిస్తున్నప్పటికీ, వారి వ్యక్తిగత జీవితం కష్టసాధ్యంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా ఫ్రీలాన్స్ జర్నలిస్టులు, చిన్న పత్రికలలో పనిచేసే వారు, వెబ్ మీడియా ప్రతినిధులు తీవ్రమైన సమస్యలను ఎదుర్కొంటున్నారని తెలిపారు. తమ సమస్యలను బహిరంగంగా చెప్పుకోలేని -మిగతా 2 లో




### దక్షిణాది రాష్ట్రాలు పోరాటానికి

# సిద్ధం కావాలి

- డీలిమిటేషన్‌లో కేంద్రం తీవ్ర వివక్ష
- 50 శాతం సీట్ల పెంపు ఏ ప్రాతిపదికణ చేస్తారు?
- మన విదేశాంగ విధానం ఆందోళనకరం
- ట్రంప్‌తో మాట్లాడి యుద్ధాని నివారించండి
- ప్రధాని మోడీకి సీఎం రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి
- ఢిల్లీలో ఓ మీడియా సంస్థతో పలు విషయాలు వెల్లడి

హైదరాబాద్
నియోజకవర్గాల పునర్విభజనలో తీవ్ర అన్యాయం జరుగుతున్న నేపథ్యం లో దక్షిణాది రాష్ట్రాలు పోరాటానికి సిద్ధం కావాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం ఢిల్లీలో ఒక ప్రయివేటు టీవీ ఛానల్ నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఇప్పుడు ఎంపీ స్థానాల్లో ఉత్తరాది, దక్షిణాది రాష్ట్రాల మధ్య ఎంత అంతరం ఉందో అంతే స్థాయిలో సీట్ల పెంపు జరగాలని డిమాండ్ చేశారు. 50 శాతం సీట్ల పెంపు అనేది ఫైనల్ బుల్లెట్ అనీ, ఏ లెక్క ప్రకారం ఆ పెంపు జరుగుతున్నదని ప్రశ్నించారు. -మిగతా 4 లో



### ఇరాన్‌తో యుద్ధం వేళ

## మోదీకి ట్రంప్ ఫోన్..

- హార్ముజ్ జలసంధిని తెరవడం చాలా అవసరమని ఇరువురు నేతలు అభిప్రాయం
- ఉద్రిక్తతలు తగ్గించేందుకు, శాంతి స్థాపనకు ఇండియా ఎప్పుడూ మద్దతుగా ఉంటుందన్న మోదీ
- హార్ముజ్ జలసంధి సహా కీలక అంశాలపై చర్చ

న్యూఢిల్లీ
ఇరాన్‌తో యుద్ధం జరుగుతున్న వేళ కీలక పరిణామం చోటు చేసుకుంది. భారత ప్రధాని నరేంద్ర మోదీకి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఫోన్ చేశారు. ఇరాన్ యుద్ధం సహా పశ్చిమాసియా పరిస్థితులు, హార్ముజ్ జలసంధి వంటి అంశాలపై చర్చలు జరిపారు. ఈ విషయాన్ని మంగళవారం ఇటు ప్రధాని మోదీ తన ఎక్స్ ఖాతాలో పేర్కొనగా, అటు అమెరికా తరపున ఇండియాలో అమెరికా రాయబారి సెర్గియో గోర్ వెల్లడించారు.ప్రస్తుత పరిస్థితుల్లో హార్ముజ్ జలసంధిని తెరవడం చాలా అవసరమని ఇరువురు నేతలు అభిప్రాయపడ్డారు. -మిగతా 2 లో



## ఢిల్లీ అసెంబ్లీ స్పీకర్‌కు బాంబు బెదిరింపు మెయిల్

- మోడీ,అమిత్ షా,జైశంకర్‌లను కూడా లేపేస్తామని హెచ్చరిక
- ఢిల్లీ మెట్రో, అసెంబ్లీలకు బాంబు బెదిరింపులు

న్యూఢిల్లీ,
దేశంలోని ప్రముఖులను హతమారుస్తామంటూ ఢిల్లీ అసెంబ్లీ స్పీకర్ విజేందర్ గుప్తాకు ఒక బెదిరింపు ఈ మెయిల్ వచ్చింది. దీంతో ఈ అంశంపై భద్రతా సిబ్బంది, అధికారులు దృష్టిసారించి తగిన చర్యలు చేపట్టారు. మంగళవారం తనకు బెదిరింపు మెయిల్ వచ్చిందని స్పీకర్ విజేందర్ గుప్తా అధికారులకు తెలిపారు. దేశంలోని ప్రముఖులను హతమారుస్తామని పేర్కొంటూ ఆ మెయిల్ వచ్చింది. అందులో ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా, విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి ఎస్.జై శంకర్, ఢిల్లీ సీఎం రేఖా గుప్తా, ఢిల్లీ మంత్రి మంజిందర్ సింగ్ సిర్సా, ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ తరంజిత్ సింగ్ సందు వంటి ప్రముఖుల పేర్లు ఉన్నాయి. అలాగే ఢిల్లీ అసెంబ్లీ, విధాన సభ మెట్రో స్టేషన్‌లకు కూడా బాంబు బెదిరింపు వచ్చింది. దీనిపై సమాచారం అందుకున్న భద్రతా సిబ్బంది, అధికారులు వెంటనే అసెంబ్లీ, విధాన సభ మెట్రో స్టేషన్లలో బాంబ్ స్క్వాడ్‌తో, -మిగతా 2 లో

### బడ్జెట్‌ను కూడా జీర్ణించుకోలేని

# బీఆర్ఎస్

## ఏం తప్పు చేశామని అంతలా విమర్శలు



- విద్యార్థులకు అల్పాహారం ఇవ్వడం తప్పా
- మహిళలను కోటీశ్రులను చేయాలనుకోవడం తప్పా
- బీమా పథకంలో ఆదుకోవాలనుకోవడం సరికాదా
- బడ్జెట్ ప్రతులు చించి ఎందుకు పారిపోయారు
- గతంలో అసెంబ్లీలో మాట్లాడే పరిస్థితి ఉండేదా
- బడ్జెట్‌పై చర్చకు సమాధానంలో బిఆర్ఎస్‌పై భట్టి చురకలు

హైదరాబాద్
బడ్జెట్‌లో మేం ఏం తప్పు చేశామని బీఆర్ఎస్ ప్రశ్నిస్తోందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. విద్యార్థులకు ఉదయం అల్పాహారం ఇవ్వడాన్ని కూడా ఓర్వలేకపోతే ఎలా? అని ప్రశ్నించారు. బడ్జెట్‌పై చర్చ సందర్భంగా శాసనసభలో ఆయన మాట్లాడుతూ.. కుటుంబాలకు బీమా సౌకర్యం కల్పించడం నేరమా అని నిలదీశారు. కుటుంబంలో పెద్ద మరణిస్తే.. ఆ కుటుంబ పరిస్థితి తలకిందులైపోతుంది. అలాంటి కుటుంబాలకు ఆర్థిక సమస్యలు ఉండకూడదని బీమా కల్పించాం. సంక్షేమ పథకాల గురించి చెబుతుంటే.. -మిగతా 2 లో




### క్రిష్టియన్ మతం స్వీకరిస్తే ఎస్సీ,ఎస్టీ

## హక్కులు ఉండవు

- మతం మారితే ఎస్సీ హక్కులు కోల్పోతారు
- క్రిష్టియానిటిలో కుల వ్యవస్థ లేదు
- హిందువుల,సిక్కు, బౌద్ధ మత్స్థులకే కుల హక్కులు
- ఎపి హైకోర్టు తీర్పును సమర్థించిన సుప్రీం కోర్టు

న్యూఢిల్లీ
మతమార్పిడికి సంబంధించి సుప్రీంకోర్టు కీలక తీర్పు వెలువరించింది. మతం మారిన ఎస్సీలకు ఆ హోదా ఉండదని స్పష్టం చేసింది. క్రిష్టియన్‌లోకి మారిన వారికి ఎస్సీ కింద లభించే వెసలుబాటు ఉండదని తేల్చింది. మతం మారితన తరవాత అట్రాసిటీ చట్టం కింద కేసులపై సుప్రీంకోర్టు కీలక ఉత్తర్వులు జారీ చేసింది. క్రైస్తవంలోకి మారిన వారు ఎస్సీ హక్కులు పొందలేరని స్పష్టం చేసింది. -మిగతా 2 లో

## వాయు కాలుష్య దేశంగా పాక్

- ప్రపంచంలోనే అత్యంత వాయు కాలుష్య నగరం మన దేశంలోనే..



2

## లొంగిపోయిన మావోయిస్టు అగ్రనేత పాపారావు..

ఒడిశాలో మరో నేత సరెండర్..!

2



# దివ్యాంగులను మోసం చేసిన కాంగ్రెస్



- వారికి ఆరువేల పెన్షన్ హామీ ఏమయ్యింది
- దివ్యాంగులకు మద్దతుగా నేడు ఇందిరాపార్క్ వద్ద ధర్నా
- ప్రభుత్వం తీరుపై మండిపడ్డ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

హైదరాబాద్,
దాదాపు ఆరున్నర, 7 లక్షల మంది దివ్యాంగులకు కాంగ్రెస్ పార్టీ చాలా వాగ్దానాలు ఇచ్చింది. 100 రోజుల్లోనే 6 వేల పెన్షన్ అని చెప్పింది. రూ.6 వేల పెన్షన్ ఇంకా ఎందుకివ్వడం లేదని ప్రభుత్వాన్ని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. కేటీఆర్ దివ్యాంగులతో కలిసి మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఆర్టీసీలో ఉచిత ప్రయాణం కల్పిస్తామని హామీనిచ్చింది. బ్యాక్ లాగ్ పోస్టుల విషయంలో, -మిగతా 2 లో

# జీవన్‌రెడ్డితో ఫలించని పిసిసి చీఫ్ దౌత్యం



- పార్టీ వీడొద్దని కోరిన మహేశ్ గౌడ్
- నిర్ణయం ఎవరి చేతుల్లోనూ లేదన్న జీవన్ రెడ్డి
- తనను పార్టీలో కావాలనే దూరం పెట్టారన్న ఆవేదన
- నేడు పార్టీ కార్యకర్తలతో భేటీకి పిలుపు

జగిత్యాల
తన పదేళ్ల ఒంటరి పోరును పార్టీ అధిష్ఠానం చిన్నచూపు చూసిందని మాజీ మంత్రి టి.జీవన్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. తనకు పీసీసీ చీఫ్ పదవి రాకున్నా.. పార్టీ అధికారంలోకి వచ్చినందుకు సంతోషపడ్డానన్నారు. మంగళవారం జగిత్యాలలోని తన నివాసానికి పార్టీ అధిష్ఠానం పంపిన దూతలతో సమావేశమయ్యారు. ఈ సమావేశం అనంతరం జీవన్ రెడ్డి మాట్లాడుతూ.. -మిగతా 2 లో

# బడ్జెట్‌ను కూడా జీర్ణించుకోలేని బిఆర్ఎస్

మొదటి తరువాయి



వినడానికి బీఆర్ఎస్‌కు సమయం లేదా? క్యాష్‌లెస్ హెల్త్ కార్డులు కావాలని ఉద్యోగులు పదేళ్ల నుంచి అడుగుతూనే ఉన్నారు. గతంలో వారు మాట్లాడేందుకు కూడా భయపడే పరిస్థితి కల్పించారు. గతంలో నేను ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు మాట్లాడేందుకు అవకాశం ఇవ్వలేదు. డిప్యూటీ సీఎం హోదాలో బడ్జెట్ ప్రవేశ పెడితే.. బడ్జెట్ పత్రాలు చించి సభ నుంచి వెళ్లిపోయారు. బీఆర్ఎస్ సభ్యులు చెప్పిందే మేం వినాలి.. వినకపోతే మేం వెళ్లిపోతామంటున్నారు. ప్రజల జీవితాల్లో మార్పు తీసుకురావడమే లక్ష్యంగా పని చేస్తున్నాం. ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాన్ని చులకనగా చూడకండి అంటూ భట్టి చురకలంటించారు. రైతు భరోసా పథకాన్ని బీఆర్ఎస్ ఎన్నికల స్కీమ్‌గా మార్చుకుంది. 2018లో ప్రజలు ఓట్లేసేందుకు క్యూలైన్‌లో ఉండగా.. రైతు భరోసా నిధులు జమచేశారు. మేం ఎప్పుడూ ఎన్నికల కోసం రైతు భరోసా నిధులు జమచేయలేదు. రైతులు పండించిన ధాన్యానికి క్వింటాకు రూ.500 అదనపు బోనస్ ఇస్తున్నాం. రైతులకు ఉచిత కరెంట్ పథకం పేటెంట్ హక్కు మాదే. వ్యవసాయాన్ని పండగలా చేసిందే కాంగ్రెస్. మా ప్రభుత్వం రాగానే రైతులకు ఒకేసారి రుణమాఫీ చేసింది. మహిళలు ఆర్థికంగా, రాజకీయంగా ఎదగకూడదన్నదే బీఆర్ఎస్ ఆలోచన అంటూ దుయ్యబట్టారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలన్నదే మా లక్ష్యం అని భట్టి విక్రమార్క అన్నారు. ఈ క్రమంలో భట్టి విక్రమార్క ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. పదేళ్ల పాటు అధికారంలో ఉండి ప్రజలను, ఉద్యోగులను నిర్బంధించిన వారు.. ఇప్పుడు ప్రజా సంక్షేమం కోసం ప్రవేశపెట్టిన బ్జడెట్‌ను వినే ఓపిక లేక సభ నుంచి వెళ్ళిపోవడం వారి అహంకారానికి నిదర్శనమని ఆయన మండిపడ్డారు. గత పదేళ్లుగా ప్రతిపక్షంలో ఉన్న నాకు జరిగిన అవమానాలు రికార్డుల్లో స్పష్టంగా ఉన్నాయి. ప్రజల సమస్యల కోసం మైక్ అడిగితే ఇవ్వని వారు, నేడు మేము ప్రతి అంశానికి సమాధానం ఇస్తామన్నా వినకుండా పారిపోతున్నారని భట్టి విక్రమార్క వ్యాఖ్యానించారు. ప్రతి పౌరుడికి సామాజిక, ఆర్థిక న్యాయం అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని, తమ ఆలోచనలన్నీ ప్రజల అవసరాల చుట్టూనే తిరుగుతాయని ఆయన స్పష్టం చేశారు. దేశ చరిత్రలో ఎక్కడా లేని విధంగా ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమం కోసం తమ ప్రభుత్వం విప్లవాత్మక నిర్ణయం తీసుకుందని భట్టి తెలిపారు. ఏదైనా కారణంతో ప్రభుత్వ ఉద్యోగి మరణిస్తే ఆ కుటుంబం వీధిన పడకూడదన్న ఉద్దేశంతో రూ. 1.20 కోట్ల ప్రమాద భీమా కల్పించామని, దీనివల్ల 7.50 లక్షల కుటుంబాలకు లబ్ధి చేకూరుతుందని వివరించారు. గతంలో ఉద్యోగులను హౌస్ అరెస్టులు చేసి, భయం భయంగా బతికించిన బీఆర్ఎస్ నేతలకు ఈ సంక్షేమం ఇష్టం లేకే సభను వీడారని విమర్శించారు. పేద విద్యార్థులు ఖాళీ కడుపుతో బడికి రావద్దన్న ఆలోచనతో పాఠశాలల్లో అల్పాహార పథకాన్ని ప్రవేశపెట్టామని డిప్యూటీ సీఎం గుర్తు చేశారు. వారంలో మూడు రోజులు పాలు, మరో మూడు రోజులు రాగిజావ అందించాలని నిర్ణయించామన్నారు. అంతేకాకుండా, ఇంటర్ విద్యార్థులకు కూడా మొట్టమొదటిసారి మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయబోతున్నామని, ఈ అభివృద్ధి పనులను చూసి ఓర్వలేక ప్రతిపక్షం బ్జడెట్ కాగితాలు చించి చెవిలో పెట్టుకుని వెళ్ళిపోయారని ఎద్దేవా చేశారు. వ్యవసాయాన్ని పండుగ చేయడమే కాంగ్రెస్ లక్ష్యమని చెబుతూ, ఉచిత విద్యుత్ అనేది కాంగ్రెస్ పార్టీ పేటెంట్ అని ఆయన పునరుద్ఘాటించారు. రాష్ట్రంలోని 29 లక్షల వ్యవసాయ పంపుసెట్లకు ఉచిత విద్యుత్ అందించేందుకు రూ. 14 వేల కోట్లు ఖర్చు చేస్తున్నామని తెలిపారు. రైతు భరోసా కింద కేవలం తొమ్మిది రోజుల్లోనే తొమ్మిది వేల కోట్లు రైతుల ఖాతాల్లో వేశామని, గత ప్రభుత్వంలాగా ఓట్ల కోసం ఔటర్ రింగ్ రోడ్డును కుదువబెట్టి డబ్బులు పంచే సంస్కృతి తమది కాదని హితవు పలికారు. సన్నధాన్యం పండించే రైతులకు క్వింటాల్‌కు రూ. 500 బోనస్ ఇస్తామని చెప్పిన మాటను నిలబెట్టుకుంటామని భరోసా ఇచ్చారు. మత, ప్రాంత భేదం లేకుండా రాష్ట్రంలోని 1.15 కోట్ల కుటుంబాలకు రూ. 5 లక్షల ప్రమాద భీమా కల్పించామని, ఇందిరమ్మ ఇళ్లు, గృహజ్యోతి, ఆర్టీసీ ఉచిత ప్రయాణం వంటి పథకాల కోసం రూ. 50 వేల కోట్లు కేటాయించామని భట్టి విక్రమార్క వివరించారు. వ్యక్తులుగా తాము చిన్నవాళ్ళం కావచ్చు కానీ, తాము చేపట్టిన ప్రజాస్వామ్య ప్రక్రియను మన్నించి చర్చలో పాల్గొనాల్సింది పోయి, 'ఆడలేక మద్యలో ఓడు' అన్నట్టుగా బీఆర్ఎస్ నేతలు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఎన్ని అడ్డంకులు ఎదురైనా తెలంగాణ ప్రజల జీవితాల్లో మార్పు కోసం తమ ప్రభుత్వం నిరంతరం పనిచేస్తుందని ఆయన ప్రసంగాన్ని ముగించారు.

# దివ్యాంగులను మోసం చేసిన కాంగ్రెస్

మొదటి తరువాయి



చదువుల విషయంలో కానీ చాలా చాలా వాగ్దానాలు వారి అభయహస్తం మేనిఫెస్టోలో చాలా వివరంగా ఇచ్చారు. అవన్నీ కూడా మా సోదరుల దగ్గర చాలా వివరంగా వారి ఫోన్లలో, వారి మనసుల్లో ముద్రించుకొని పోయి ఉన్నయి. తెల్లారి లేస్తే శారీరకంగా అవస్థలు పడే దివ్యాంగులు కోరుతున్నది ప్రత్యేకంగా కొత్తగా ఏం లేదన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలు నిలబెట్టుకోవాలి. కాంగ్రెస్ పార్టీగా ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని వారు ఇవాళ అసెంబ్లీలోకి రావాలని ప్రయత్నం చేశారు. నేనడిగాను అసెంబ్లీలో లోపలికి రానీయండి.. మా లెజిస్లేచర్ పార్టీ ఆఫీస్‌లో కలుద్దాం. వారు బయట రోడ్డు మీద కలవటం కరెక్టు కాదు. కానీ వీళ్లంతా వస్తే మాకేదో ఇబ్బంది అయితది. వాళ్లను వద్దు అని చెప్పి పాసులు కూడా ఇయ్యకుండా సతాయిస్తే వారిని నడిరోడ్డుమీద కలవాల్సిన దుస్థితి ఈ రాష్ట్రంలో నెలకొందని కేటీఆర్ మండిపడ్డారు. దివ్యాంగుల గురించి కల్లబొల్లి కబుర్లు చెప్పి ఓట్లు పొంది గద్దెనెక్కిన కాంగ్రెస్ పార్టీని మేం ఈ బ్జడెట్ సెషన్‌లో అడుగుతాం.. నిలదీస్తాం. రూ.6 వేల పెన్షన్ ఇంకా ఎందుకివ్వడం లేదు. పక్క రాష్ట్రంలో రూ.6 వేల పెన్షన్ ఇస్తున్నరు. మీరు గద్దెనెక్కిన తర్వాత మూడో బ్జడెట్ ఇది 60 శాతం సమయం అయిపోయిన తర్వాత కూడా ఎందుకు ఇంకా డబ్బులు కేటాయించడం లేదు. నిలదీస్తాం. దీంతోపాటు దివ్యాంగులకు గతంలో మేం డబుల్ బెడ్‌రూం ఇండ్లు ఇచ్చి ఆదుకునే ప్రయత్నం చేసినం. ప్రతీ దాంట్లో కోటా పెట్టి వారిని ఆదుకునే ప్రయత్నం చేశాం. భవిష్యత్‌లో ఇంకా ఎక్కువ చేస్తాం. కానీ ఈ ప్రభుత్వం దివ్యాంగ సోదరసోదరీమణులకు ఇచ్చిన హామీలు అమలు చేసేదాకా వదిలిపెట్టమని కేటీఆర్ హెచ్చరించారు. నేడు ఇందిరాపార్క్ దగ్గర వాళ్లు రిలే నిరాహార దీక్షకు పిలుపునిచ్చారు దానికి కూడా మా మద్దతు ఉంటుంది. పార్టీ నాయకులం కూడా హాజరవుతాం. తప్పకుండా దాన్ని కూడా విజయవంతం చేయాల్సిందిగా దివ్యాంగ సోదరులను విజ్ఞప్తి చేస్తున్నామన్నారు.

# జీవన్‌రెడ్డితో ఫలించని పిసిసి చీఫ్ దౌత్యం

మొదటి తరువాయి

రాజకీయాల్లో తనది పూలబాట కాదని.. ముళ్ల బాట అని స్పష్టం చేశారు. పీసీసీ చీఫ్ కాబట్టి రేవంత్ రెడ్డికి ముఖ్యమంత్రి, సీఎల్పీ లీడర్ కాబట్టి భట్టి విక్రమార్కకు డిప్యూటీ సీఎం పదవి ఇచ్చారన్నారు. కానీ తాను శాసన మండలిలో నేతను అని ఈ సందర్భంగా జీవన్ రెడ్డి గుర్తు చేశారు. మరి తనకెందుకు అన్యాయం చేశారంటూ కాంగ్రెస్ అధిష్ఠానం పెద్దలను ఈ సందర్భంగా జీవన్ రెడ్డి సూటిగా ప్రశ్నించారు. పార్టీ ఫిరాయింపుల్లో మనకు బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ ఆదర్శం కాదు కదా? అంటూ కాంగ్రెస్ నేతలకు ఆయన చరకలంటించారు. పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ ఆలోచనలు ఏమిటి? మనం చేస్తున్నదేమిటంటూ రాష్ట్రంలోని పార్టీ నేతలను ఈ సందర్భంగా ఆయన సూటిగా నిలదీశారు. పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి కె.సి.వేణుగోపాల్ వంటి నేతలు ఇచ్చిన హామీ అమలు కాకపోతే పార్టీ ఎందుకంటూ జీవన్ రెడ్డి ఈ సందర్భంగా కొంత అసహనం వ్యక్తం చేశారు. అధిష్ఠానం తనను బుజ్జగించలేదని చెప్పారు. తాను పార్టీ వీడి వెళ్తున్నానని తెలిసి.. అలా వచ్చి వెళ్లారంటూ కాంగ్రెస్ ప్రతినిధుల రాకపై జీవన్ రెడ్డి స్పందించారు.కాంగ్రెస్ పార్టీని వీడొద్దని మాజీ మంత్రి జీవన్‌రెడ్డిని కోరామని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ తెలిపారు. జగిత్యాలలో జీవన్‌రెడ్డితో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సాకేవత్‌తో కలిసి ఆయన సమావేశమయ్యారు. సుదీర్ఘమైన రాజకీయ చరిత్ర, 43 ఏళ్ల అనుభవం ఉన్న నాయకుడు జీవన్‌రెడ్డి. ఆయన మాకు తండ్రిలాంటివారు. రాజకీయాల్లో ఆయన సీనియర్ నేత. జీవన్‌రెడ్డిని కొన్ని ఇబ్బందులకు గురయ్యారు. కాంగ్రెస్ పార్టీ ఆయన్ను వదలుకోదలచుకోలేదు. పార్టీ వీడే అంశంలో పునరాలోచన చేయాలని కోరాం అని మహేశ్‌కుమార్‌గౌడ్ తెలిపారు. జగిత్యాలలో జీవన్ రెడ్డితో పీసీసీ అధ్యక్షులు మహేష్ భేటీ ముగిసింది. పార్టీలో కొనసాగండి, పార్టీని వీడకండి. భవిష్యత్తుపై చర్చిద్దామని పీసీసీ చర్చలు జరిపారు. ఏఐసీసీ నాయకులు సైతం పార్టీలోనే కొనసాగాలని జీవన్ రెడ్డిని కోరారు. భేటీ అనంతరం మహేష్‌గౌడ్ మాట్లాడారు. 'జీవన్ రెడ్డి మా తండ్రి సమానులు. 43 ఏళ్ల సుదీర్ఘ రాజకీయ చరిత్ర ఆయనది. రాష్ట్రంలో అంతకన్నా సీనియర్ నాయకులు లేరు. గత అసెంబ్లీ ఎన్నికల్లో కొంత ఇబ్బంది పడ్డారు. ఈ వయసులోనూ ఇబ్బంది పడ్డారు. కొన్ని సార్లు రాజకీయంలో అనుకోని నిర్ణయాలు తీసుకోవాల్సి వస్తుంది. జీవన్‌రెడ్డి ఇబ్బందుల్లో ఉన్నారు కాబట్టి నా సూచనల మేరకు మంత్రి శ్రీధర్ బాబు వచ్చారు. నేను కూడా ఈ రోజుల కలిశాను. కాంగ్రెస్‌తో అనుబంధాన్ని తెంచొద్దని, మమ్మల్ని వీడొద్దని వారికి విన్నవించడం జరిగింది. కార్యకర్తల ఒత్తిడి తదితర కారణాల వల్ల వారు ఈ నిర్ణయం తీసుకుంది. వారు పార్టీలోనే ఉండాలని ఏఐసీసీ పట్టుబడుతోంది. నాకు జీవన్‌రెడ్డితో 1986 నుంచి పరిచయం. అప్పటి నుంచి మాకు రాజకీయంగా సలహాలు ఇచ్చారని తెలిపారు. జీవన్ రెడ్డి రాజీనామా చేయరు అనే ఆశతో ఇక్కడి నుంచి వెళ్తున్నామని మహేష్‌కుమార్ గౌడ్ చెప్పారు.అయితే వారు ఎలాంటి హామీ ఇవ్వలేక పోయారు. దీంతో ఆయనకు సూచనలు చేసి వెనుదిరిగారు. పార్టీ మారడామా లేదా అన్నది కూడా తన చేతిలో లేదని ఈ సందర్భంగా జీవన్ రెడ్డి వ్యాఖయానించారు. ఇప్పటికే శ్రీధర్ బాబు, అడ్లూరి లక్ష్మణ్‌లు ఓమారు జీవన్ రెడ్డితో భేటీ అయ్యారు. ఇక ఈ భేటీ అంనంతరం ఆసక్తికర సంఘటన చోటు చేసుకుంది. ఈ చర్చలు ఫలించలేదు. జీవన్‌రెడ్డి ఇంటిపై ఉన్న కాంగ్రెస్ ఫ్లెక్సీని అభిమానులు తొలగించారు. ఈ సందర్భంగా జీవన్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. ఇది పరిష్కారం లేని సమస్యగా మారింది.. సమస్యకు పరిష్కారం నా దగ్గర లేదు.. వారి దగ్గర కూడా లేదు.

# వాయు కాలుష్య దేశంగా పాక్

**ప్రపంచంలోనే అత్యంత వాయు కాలుష్య నగరం మన దేశంలోనే..**



**న్యూఢిల్లీ,**

ప్రపంచంలోనే అత్యంత కాలుష్య నగరాలు, దేశాలకు సంబంధించిన జాబితా ఒకటి తాజాగా విడుదలైంది. గత ఏడాది అంచనాల ప్రకారం ప్రపంచంలోనే అత్యంత వాయు కాలుష్య దేశంగా పాకిస్తాన్ నిలిచింది. ఇక ప్రపంచంలోనే అత్యంత వాయు కాలుష్య నగరంగా ఇండియాలోని చిన్న పట్టణమైన లోని నిలిచింది. ఇది ఉత్తర ప్రదేశ్, ఘజియాబాద్‌కు దగ్గర్లో ఉంటుంది. ఐక్యూఎయిర్ అనే స్విట్జర్లాండ్‌కు చెందిన సంస్థ 2025లో అత్యంత వాయు కాలుష్య దేశాలు, నగరాలకు సంబంధించి నివేదిక రూపొందించింది. ఈ జాబితాను మంగళవారం విడుదల చేసింది. దీని ప్రకారం మొత్తం 143 దేశాల్లో వాయు కాలుష్యాన్ని పరిగణనలోకి తీసుకున్నారు. ఇందులో 130 దేశాలు ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచించిన వాయు కాలుష్య ప్రమాణాల్లో విఫలమయ్యాయి. లోని నగరంలో పీఎం 2.5కి వాయు కాలుష్యం 112.5 మైక్రో గ్రామ్స్‌గా ఉంది. పీఎం 2.5 అంటే 2.5 మైక్రోమీటర్లకంటే తక్కువగా ఉన్న కాలుష్య రేణువులు అని అర్థం. ఇంత తక్కువగా ఉంటే అవి ముక్కు, శ్వాస ద్వారా లంగ్స్‌లోకి, రక్తంలోకి చొచ్చుకుపోగలవు. దీంతో ఆస్తమా, గుండె జబ్బులు వంటి అనారోగ్యాలు దరిచేరే అవకాశం ఉంది. లోని నగరం నేషనల్ క్యాపిటల్ రీజన్ (ఎన్‌సీఆర్) పరిధిలో ఉంది. చుట్టుపక్కల పరిశ్రమలు ఉండటం, వాహన కాలుష్యం కారణంగా ఇక్కడ పొల్యూషన్ పెరుగుతోంది. ప్రపంచంలోనే అత్యంత కాలుష్యం కలిగిన దేశంగా పాకిస్తాన్ నిలిచింది. ఇక్కడ సాధారణ వాయు ప్రమాణాలకంటే 13 రెట్లు ఎక్కువ కాలుష్యం ఉంది. కాలుష్యం ఎక్కువగా ఉన్న రెండో దేశంగా పాకిస్తాన్, మూడో దేశంగా తజికిస్తాన్ ఉన్నాయి. మొత్తం 75 దేశాల్లో కాలుష్య స్థాయిలు తగ్గగా, 54 దేశాల్లో పెరిగాయి. 2024లో ప్రపంచంలోని నగరాల్లో 17 శాతం మాత్రమే వాయు ప్రమాణాలను అందుకోగా, 2025లో ఈ సంఖ్య 14 శాతానికి తగ్గింది.

## ఇరాన్‌తో యుద్ధం వేళ మోదీకి ట్రంప్ ఫోన్..

మొదటి తరువాయి

ట్రంప్‌తో చర్చలపై మోదీ తన ఎక్స్ ఖాతాలో వెల్లడించారు. ట్రంప్ నుంచి కాల్ అందుకున్నట్లు, పశ్చిమాసియా ఉద్రిక్తతలపై చర్చించినట్లు తెలిపారు. ఉద్రిక్తతలు తగ్గించేందుకు, శాంతి స్థాపనకు ఇండియా ఎప్పుడూ మద్దతుగా ఉంటుందని మోదీ అభిప్రాయపడ్డారు. అలాగే, హార్ముజ్ జలసంధిని తెరిచి, ప్రపంచ అవసరాలకు అనుగుణంగా అందుబాటులో ఉంచడం అవసరమని పేర్కొన్నారు. ఈ అంశంలో స్థిరత్వం, శాంతికి ఎప్పుడూ అందుబాటులో ఉంటామని ట్రంప్‌నకు మోదీ తెలిపారు. హార్ముజ్ జలసంధిలో అడ్డగింత అంగీకరించదగింది కాదని మోదీ అంతకుముందు పార్లమెంట్‌లో అన్నారు. వాణిజ్య నౌకలపై దాడి చేయడం సరికాదన్నారు. చర్చలు, దౌత్య మార్గాల ద్వారా భారత నౌకల్ని సురక్షితంగా తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నామని తెలిపారు. ఇరాన్‌పై ఐదు రోజులపాటు దాడులు ఆపేస్తామని ట్రంప్ పేర్కొన్న మరుసటి రోజే ప్రధాని మోదీకి ఫోన్ చేయడం విశేషం.

## ఢిల్లీ అసెంబ్లీ స్పీకర్‌కు బాంబు బెదిరింపు మెయిల్

మొదటి తరువాయి

డిస్పోజబుల్ టీమ్స్‌తో తనిఖీలు చేపట్టారు. అసెంబ్లీ ప్రాంగణం, మెట్రో స్టేషన్ పరిసరాల్ని క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు. ఈ ప్రాంతం మొత్తం హై అలర్ట్ కొనసాగిస్తున్నారు. అయితే, ఇలాంటి బెదిరింపులు రావడం సహజమే అని, అలాగని వాటిని తేలిగ్గా తీసుకోలేమని, అందుకే భద్రతను కట్టుదిట్టం చేశామని ఢిల్లీ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ మోహన్ సింగ్ బిష్ట్ అన్నారు. ఈ బెదిరింపులపై తామేమీ భయపడటం లేదని, అసెంబ్లీ సమావేశాలు యథావిధిగా కొనసాగుతున్నాయని ఆయన తెలిపారు. పరిస్థితి అదుపులోనే ఉందని, భద్రత విషయంలో ఎలాంటి ఆందోళనా అవసరం లేదని బీజేపీ ఎమ్మెల్యేలు అన్నారు. ఇక ఢిల్లీ అసెంబ్లీలో బ్జడెట్ ప్రవేశపెడుతున్న సందర్భంగా సీఎం రేఖా గుప్తా కూడా అసెంబ్లీకి చేరుకున్నారు. బెదిరింపు ఈ మెయిల్ ఎక్కడి నుంచి వచ్చిందో తెలుసుకునేందుకు అధికారులు ఆరాతీస్తున్నారు.


## క్రిష్టియన్ మతం స్వీకరిస్తే ఎస్సీ,ఎస్టీ హక్కులు ఉండవు

మొదటి తరువాయి

హిందువులు, బౌద్ధులు, సిక్కులు మాత్రమే ఆ హక్కులు పొందుతారని పేర్కొంది. ఈ వ్యవహారంలో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు సమర్థించింది. ఏపీ హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ చింతాడ ఆనంద్ అనే వ్యక్తి దాఖలు చేసిన పిటిషన్‌పై అత్యున్నత న్యాయస్థానం విచారణ చేపట్టి.. మంగలశారం తుది ఉత్తర్వులు జారీ చేసింది. బాపట్ల జిల్లా పిట్టలవానిపాలెంలో పాస్టర్ చింతాడ ఆనంద్ ఎటువంటి అనుమతులు లేకుండా చర్చి నిర్వహించడంపై అక్కల రామిరెడ్డితో పాటు స్థానికులు అభ్యంతరం తెలిపారు. వారిపై అట్రాసిటీ నిరోధక చట్టం కింద ఆనంద్ కేసు పెట్టారు. ఆ కేసును కొట్టివేయాలంటూ రామిరెడ్డి, స్థానికులు ఏపీ హైకోర్టును ఆశ్రయించారు. చింతాడ ఆనంద్ పాస్టర్‌గా పనిచేస్తుండటంతో క్రైస్తవుడవుతారని.. రాజ్యాంగం ప్రకారం షెడ్యూలు కులాలకు సంబంధం ఉండదని రామిరెడ్డి తరఫు న్యాయవాదులు వాదనలు వినిపించారు. పుట్టుకతో హిందువు అయినా.. క్రైస్తవం స్వీకరించడంతో ఆనంద్ షెడ్యూల్ కులానికి చెందరని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. అట్రాసిటీ చట్టంలోని సెక్షన్లు ఆయనకు వర్తించవని, ఫిర్యాదు చట్ట వ్యతిరేకమని.. తమపై పెట్టిన కేసుకు విచారణార్హత లేదని వాదించారు. రామిరెడ్డి తరఫు న్యాయవాదుల వాదనలను హైకోర్టు పరిగణనలోకి తీసుకుంది. క్రైస్తవ మతంలో కులవ్యవస్థ లేదని పేర్కొంది. హిందూ, సిక్కు, బౌద్ధ మతాలకు చెందిన వారికే ఎస్సీ హక్కులు పొందే అర్హత ఉంటుందని స్పష్టం చేసింది. ఈ తీర్పును సవాల్ చేస్తూ ఆనంద్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. దీనిపై సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ పీకే మిశ్రా, జస్టిస్ అంజరియా ధర్మాసనం విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా ఏపీ హైకోర్టు తీర్పును సమర్థించింది. హిందూ, బౌద్ధ, సిక్కు మతాల్లోని వారు మాత్రమే ఎస్సీ హోదాకు అర్హులని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. అలా కాకుండా మతం మారితే ఎస్సీ హోదా రద్దవుతుందని తేల్చి చెప్పింది. క్రైస్తవ మతంలోకి మారి పాస్టర్‌గా పని చేస్తున్న వ్యక్తి ఎస్సీ, ఎస్టీ చట్టం కింద రక్షణ పొందలేరని స్పష్టం చేసింది. పాస్టర్ ఆనంద్ దశాబ్దానికి పైగా క్రైస్తవంలో ఉన్నారని.. తిరిగి మారలేదని నిరూపణ అయిందని ధర్మాసనం పేర్కొంది.

## లొంగిపోయిన మావోయిస్టు అగ్రనేత పాపారావు..

**ఒడిశాలో మరో నేత సరెండర్..!**



**న్యూఢిల్లీ,**

: మావోయిస్టు అగ్రనేత పాపారావ అలియాస్ సున్నం చంద్రయ్య లొంగిపోయారు. తన అనుచరులతో కలిసి ఆయన బీజాపూర్ ఎస్పీ ఎదుట సరెండర్ అయ్యారు. ఆయనతో పాటు లొంగిపోయిన 17మందిలో.. 10 మంది పురుషులు, 8 మంది మహిళా మావోయిస్ట్‌లు ఉన్నారు. వీరినుంచి పోలీసులు భారీగా ఆయుధాలు స్వాధీనం చేసుకున్నారు. మరో కీలక నేత సుక్రు సైతం ఒడిశాలో లొంగిపోయారు.ఆపరేషన్ కగార్ ఉధృతమవ్వడం, లొంగిపోయిన మావోయిస్టులకు ప్రభుత్వాలు పునరావాసం కల్పిస్తున్న నేపథ్యంలో కీలక నేతలు జనం వీడుతున్నారు. ఇప్పటికే పలువరు కీలక నేతలు జనజీవన స్రవంతిలో కలవగా బస్తర్‌కు చెందిన పాపారావు కూడా లొంగిపోయారు. ఆయనపై రూ.2 కోట్ల రివార్డు ఉంది. పావార 50కి పైగా ఏసులు 76 మంది భద్రతా సిబ్బంది హత్యలో పాపారావు హస్తముంది.సుక్మా జిల్లా కలెక్టర్ కిడ్నాప్ కేసులోనూ ఆయన పాత్ర ఉంది. ఒడిశాలో లొంగిపోయిన సుక్రుపై రూ.55 లక్షల రివార్డు ఉంది.

## జర్నలిస్టుల సమస్యలపై మండలి లో గళమెత్తిన ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి

మొదటి తరువాయి

పరిస్థితుల్లో కూడా నిబద్ధతతో పనిచేస్తున్నారని పేర్కొన్నారు. ఆరోగ్య బీమా పథకాలు అందరికీ చేరడం లేదని, అర్హులైన జర్నలిస్టులందరికీ క్యాష్‌లెస్ వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. జర్నలిస్టు కుటుంబాలకు ప్రైవేటు ఆసుపత్రుల్లో కూడా మెరుగైన వైద్య సదుపాయాలు కల్పించాలని కోరారు. హౌసింగ్ సైట్లు, పెన్షన్, ప్రమాద బీమా వంటి సంక్షేమ పథకాలను విస్తరించాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. జర్నలిస్టులపై జరుగుతున్న దాడులు, బెదిరింపులు పెరుగుతున్న నేపథ్యంలో వారి భద్రత కోసం కఠిన చట్టాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. మీడియా స్వేచ్ఛను కాపాడడం ప్రజాస్వామ్య పరిరక్షణకు అత్యంత అవసరమని ఆయన అభిప్రాయపడ్డారు. అక్రిడేషన్ వ్యవస్థలో డెస్క్, ఫీల్డ్ జర్నలిస్టుల మధ్య తేడాలు లేకుండా అందరికీ సమాన అవకాశాలు కల్పించాలని, ఏప్రిల్ 30 గడువును పొడిగించి అర్హులందరికీ న్యాయం చేయాలని కోరారు. మహిళా జర్నలిస్టులకు 33 శాతం రిజర్వేషన్ కల్పించడం, జర్నలిస్టులకు రైల్వే, బస్సు పాసులు అందించడం, డిజిటల్ మీడియా జర్నలిస్టులను గుర్తించడం వంటి పలు సూచనలు చేశారు. జర్నలిస్టులు మాన్యాలు కోరడం లేదని, కనీస సహకారం మాత్రమే ఆశిస్తున్నారని పేర్కొన్నారు. వారి భవిష్యత్తు బలోపేతం అయితేనే ప్రజాస్వామ్యం మరింత బలపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో మంగళవారం హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో నెరా రాష్ట్ర కమిటీ సభ్యులు తక్కెళ్లపల్లి రవీందర్ రావును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ భేటీలో నెరా రాష్ట్ర అధ్యక్షుడు, ఓపెన్ ఫ్రేమ్ ఎడిటర్ కట్ట సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి, తొలి వార్త ఎడిటర్ నరేందర్, ఉపాధ్యక్షుడు, వార్తా సంధ్య అధ్యక్షుడు సిగ్గేమ్ కిరణ్ కుమార్, కోశాధికారి, స్పెషల్ ఎడిషన్ ఎడిటర్ ఎస్‌బిఎస్ చారి పాల్గొన్నారు.సుమారు 40 నిమిషాల పాటు జరిగిన ఈ సమావేశంలో జర్నలిస్టులు, పత్రిక ఎడిటర్లు ఎదుర్కొంటున్న సమస్యలను వారు వివరంగా చర్చించారు. జర్నలిస్టుల సంక్షేమానికి సంబంధించి తీసుకోవాల్సిన చర్యలపై అభిప్రాయాలను పంచుకున్నారు. ఈ సందర్భంగా తక్కెళ్లపల్లి రవీందర్ రావు త్వరలోనే ఐఅండ్‌పీఆర్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని కలిసి సమగ్ర నివేదిక అందించాలని సూచించారు. జర్నలిస్టుల సమస్యలపై మంత్రి సానుకూలంగా స్పందిస్తారని విశ్వాసం వ్యక్తం చేశారు. అనంతరం నెరా రాష్ట్ర కమిటీ తరఫున ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్ రావును శాలువాతో ఘనంగా సత్కరించి, జ్ఞాపికను అందజేశారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి తమవంతు కృషి కొనసాగుతుందని నెరా ప్రతినిధులు తెలిపారు.

RNI NO: TGTEL/25/A0471 తెలుగు దిన పత్రిక

# మైనింగ్ వెంటనే నిలిపివేయాలని మున్సిపాలిటీ కమిషనర్,చైర్మన్,వైస్ చైర్మన్ కి వినతిపత్రం అందజేస్తున్న సాకిబండతండా రైతులు



**ఆమనగల్, మార్చి 24, (నేటి దర్శిని ప్రతినిధి):** ఆమనగల్ మున్సిపాలిటీ పరిధిలోని సాకిబండ తాండా ప్రజలు తమ సమస్యలను పరిష్కరించాలంటూ మున్సిపల్ అధికారులకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సాకిబండ తాండా సమీపంలోని గుట్టపై జరుగుతున్న మైనింగ్ ఏర్పాట్లను వెంటనే నిలిపివేయాలని వారు డిమాండ్ చేశారు.
మైనింగ్ కార్యకలాపాల వల్ల తమ వ్యవసాయ భూములు నష్టపోతాయని, బ్లాస్టింగ్ కారణంగా ఇళ్లకు ప్రమాదం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే గ్రీన్ఫీల్డ్ రోడ్ నిర్మాణంలో భాగంగా తమ భూములను కోల్పోయామని, మిగిలిన భూమి కూడా మైనింగ్ వల్ల ప్రమాదంలో పడుతుందని పేర్కొన్నారు. కావున మైనింగ్‌కు అనుమతులు ఇవ్వకుండా, ప్రజల ప్రాణాలు మరియు ఆస్తులను రక్షించాలంటూ మున్సిపల్ కమిషనర్, చైర్మన్, వైస్ చైర్మన్‌కి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు పత్య నాయక్,పాండు నాయక్, ప్రశాంత్ నాయక్,మణిపాల్ నాయక్, రవి రాథోడ్, వినోద్ నాయక్, హరి నాయక్ తదితరులు రైతు నాయకులు పాల్గొనడం జరిగింది.

# నూతన ఎస్ హెచ్ఓ కి అభినందనలు తెలిపిన


● కౌన్సిలర్ కె,అనిత శ్రీనివాస్ రెడ్డి.




**ఆమనగల్,మార్చి24(నేటి దర్శిని ప్రతినిధి);** ఆమనగల్ ఎస్ హెచ్ఓ గా ఇటీవల బాధ్యతలను స్వీకరించిన ఎస్,వెంకటేశ్వర్లు ను మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్ కార్యాలయంలో 10వ వార్డు కౌన్సిలర్ కోగూరి అనిత శ్రీనివాస్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పూల మొక్కను అందించి శాలువాలతో సత్కరించి ఆయనను అభినందించారు. శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేయాలని శ్రీనివాసరెడ్డి ఆకాంక్షించారు. ఆయన వెంట శ్రీధర్ నాయక్,రవీందర్,రవి,రమేష్, హరియా, తదితరులు ఉన్నారు.

# ప్రజల భద్రతే పోలీసుల లక్ష్యం రోడ్డు భద్రత,మాదక ద్రవ్యాల నియంత్రణ



మహబూబ్ నగర్ జిల్లా ఎస్పీ
డి.జానకి ఐపీఎస్

● **వేసవి కాలంలో పిల్లల రక్షణపై ప్రత్యేక దృష్టి: జిల్లా ఎస్పీ డి. జానకి, ఐపిఎస్**

**మిడ్జిల్, మార్చి24, (నేటిదర్శిని మహబూబ్ నగర్ జిల్లా బ్యూరో):** మహబూబ్‌నగర్ జిల్లా ఎస్పీ డి.జానకి, ఐపిఎస్ మంగళవారం అడ్డాకల్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లోని రికార్డులు, పెండింగ్ కేసులు, దర్యాప్తు పురోగతి మరియు స్టేషన్ నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, పోలీస్ అధికారులు ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరించి, పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదును బాధ్యతగా స్వీకరించి త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. నేరాల నియంత్రణలో అప్రమత్తంగా ఉండి, చట్టవిరుద్ధ కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన "అర్రైవ్ అలైవ్ (Arrive Alive) కార్యక్రమం ద్వారా రోడ్డు భద్రతపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు ట్రాఫిక్ నియమాలను తప్పనిసరిగా పాటించాలి అని, హెల్మెట్ వినియోగం, అతివేగ నియంత్రణ, మద్యం సేవించి వాహనాలు నడపకూడదనే విషయాలపై ప్రత్యేక ప్రచారం చేపట్టాలని పేర్కొన్నారు.అలాగే మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాలపై ప్రజలకు, ముఖ్యంగా యువతకు అవగాహన కల్పించి, మాదక ద్రవ్యాల అక్రమ రవాణా మరియు వినియోగంపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారులకు ఆదేశించారు.మహిళలు, పిల్లలు మరియు వృద్ధుల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని, పెండింగ్ కేసులను త్వరితగతిన పూర్తి చేసి చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని సూచించారు.ఇకపోతే, ప్రస్తుతం ప్రారంభమవుతున్న వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని, చిన్నపిల్లలు సెలవుల సమయంలో అజాగ్రత్తగా ప్రమాదకర చర్యల్లో పాల్గొనకుండా ఉండేలా తల్లిదండ్రులు మరియు విద్యార్థులకు అవగాహన కల్పించాలని అడ్డాకల్ పోలీస్ స్టేషన్ సబ్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ గారికి సూచించారు. ముఖ్యంగా నీటి ప్రాంతాలు, అగ్ని సంబంధిత ప్రమాదాలు మరియు ఇతర అనవసర కార్యకలాపాల నుండి పిల్లలను దూరంగా ఉంచేలా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో అడ్డాకల్ పోలీస్ స్టేషన్ సబ్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ మరియు ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# నూతన అంగన్వాడి భవన నిర్మాణ పనులను పరిశీలించిన ఎంపీడీవో....



**ఆమనగల్,మార్చి24(నేటి దర్శిని ప్రతినిధి);** ఆమనగల్లు మండలం మంగళపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని చెన్నకేశవ కాలనీలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల సముదాయంలోని స్థలంలో నూతనంగా నిర్మిస్తున్న అంగన్వాడి భవన నిర్మాణ సముదాయాన్ని ఆమనగల్లు ఎంపీడీవో కుసుమ మాధురి మంగళపల్లి సర్పంచ్ మౌనికతో కలిసి మంగళవారం సందర్శించారు. అలాగే నిర్మాణం అవుతున్న ఆ భవనంలో కలియ తిరుగుతూ ఆ భవనాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎంపీడీవో కుసుమ మాధురి తో పాటు మంగళపల్లి గ్రామ సర్పంచ్ మౌనిక, పంచాయితీ సెక్రటరీ గాయత్రి, అంగన్వాడీ టీచర్ అనిత, పంచాయతీ సిబ్బంది పర్వతాలు,తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ మేడారం సమ్మక్క సారలమ్మ దేవాలయం హుండీల లెక్కింపు...!




**ఉమ్మడి వరంగల్, మార్చి 23 (నేటి దర్శిని బ్యూరో):** ఉమ్మడి వరంగల్ జిల్లా ములుగు మేడారం సమ్మక్క, సారలమ్మ వనదేవతల దేవాలయం హుండీల కానుకల లెక్కింపు మంగళవారం ప్రారంభించారు. మేడారం మహా జాతర తర్వాత భక్తులు భారీగా తరలివచ్చి సమర్పించిన కానుకలతో గద్దెలపై ఉన్న సుమారు 30 హుండీలు నిండడంతో, దేవాలయం ఈవో వీరస్వామి , పూజారుల సంఘం అధ్యక్షులు జగ్గారావు ఆధ్వర్యంలో కట్టుదిట్టమైన భద్రత మధ్య హుండీల లెక్కింపు ప్రారంభమైంది. ఈసారి రికార్డు స్థాయిలో ఆదాయం వచ్చే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు.

# రాజీ మార్గమే రాజ మార్గం...

● **ఈ నెల 28న జాతీయ లోక్ అదాలత్ ప్రజలకు తక్షణ న్యాయం**

● **కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి**

● **జిల్లా ఎస్పీ డి.జానకి ఐపీఎస్**




మహబూబ్ నగర్ జిల్లా ఎస్పీ
డి. జానకి ఐపిఎస్

**మిడ్జిల్, మార్చి 24, (నేటి దర్శిని మహబూబ్ నగర్ జిల్లా బ్యూరో):** మహబూబ్‌నగర్ జిల్లా ప్రజల న్యాయ సంబంధిత సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు భారత ప్రభుత్వం నిర్వహిస్తున్న జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎస్పీ డి.జానకి ఐపీఎస్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా, కోర్టుల పరిధిలో ఉన్న వివిధ కేసులను లోక్ అదాలత్ ద్వారా సులభంగా పరిష్కరించుకునే అవకాశం ఉందని తెలిపారు. తక్కువ ఖర్చుతో, త్వరితగతిన న్యాయం పొందేందుకు ఇది ఉత్తమ మార్గమని పేర్కొన్నారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ...ఈ నెల 28న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌లో కక్షిదారులు పాల్గొని తమ కేసులను పరిష్కరించుకోవాలని సూచించారు. చిన్న చిన్న కేసులు, ట్రాఫిక్ చలానాలు, మైనర్ క్రిమినల్ కేసులు, సివిల్ వివాదాలు వంటి అంశాలను లోక్ అదాలత్ ద్వారా సులభంగా పరిష్కరించుకోవచ్చని తెలిపారు. న్యాయస్థానాల్లో పెండింగ్‌లో ఉన్న కేసులను తక్కువ సమయంలో ముగించుకునే మంచి అవకాశం ఇదని, శాంతియుతంగా ఇరు పక్షాల అంగీకారంతో సమస్యలు పరిష్కారం అయ్యే విధానం లోక్ అదాలత్ అని తెలిపారు.కోర్టుల్లో ఉన్న కేసులను త్వరగా పరిష్కరించుకునేందుకు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని జిల్లా ఎస్పీ శ్రీమతి డి.జానకి ఐపీఎస్ తెలిపారు.

# శ్రీ సీతారామచంద్రమూర్తికి కళ్యాణ వస్త్రాలు బహుకరించిన కార్పొరేటర్



**ఉమ్మడి వరంగల్, మార్చి 24 (నేటి దర్శిని బ్యూరో):** వరంగల్ నగరంలోని కాజీపేట మండలం మడికొండ గ్రామంలో శ్రీ మెట్టుగుట్ట రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో శ్రీరామనవమి బ్రహ్మోత్సవాలు ప్రారంభమైనాయి. ఈ సందర్భంగా 64 వ డివిజన్ కార్పొరేటర్ ఆవాలరాధికా రెడ్డి నరోత్తమ రెడ్డి దంపతులు శ్రీ సీతారామ చంద్ర మూర్తికి కళ్యాణ వస్త్రాలు, అర్చకులకు దీక్ష వస్త్రాలు మంగళవారం బహుకరించారు. అలాగే శ్రీ గోక కల్పన కరుణాకర్ దంపతులు1, 70,000 విలువైన రెండు హుండీలను దేవస్థానా నికి బహుకరించారు .ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో సత్యనారాయణ, అర్చకులు పరాశరం,విష్ణువర్ధనాచార్యులు , ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.


# ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవం ర్యాలీని ప్రారంభించిన కలెక్టర్




**ఉమ్మడి వరంగల్ మార్చి 24 (నేటి దర్శిని బ్యూరో):** క్షయ వ్యాధిపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అన్నారు. మంగళవారం ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవ సందర్భంగా సీకేఎం కళాశాల జంక్షన్ నుంచి దేశాయిపేట పట్టణ ఆరోగ్య కేంద్రం వరకు నిర్వహించిన భారీ ర్యాలీనీ కలెక్టర్ ప్రారంభించారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా వ్యాధి నిర్ధారణ పరీక్షలు ఉచిత చికిత్సలపై ప్రజల్లో చైతన్యం తేవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# సంపాదకీయం

## రూ'పాయే'!



ప్రపంచ మార్కెట్‌లో రూపాయి విలవిలలాడుతున్నది. మునుపెన్నడూ లేని విధంగా పాతాళానికి దిగజారుతున్నది. మరీ ముఖ్యంగా మోడీ అధికారంలోకి వచ్చిన నాటి నుండి రూపాయి విలువ రోజురోజుకూ పడిపోతూనే ఉంది. రూపాయి విలువ పెంచుతానంటూ ప్రధాని చెబుతున్న మాటలు ఉత్తికోతలే అని స్పష్టమవుతూనే ఉంది. డాలర్‌తో పోలిస్తే నేడు మన రూపాయి విలువ 94.10కి చేరుకుంది. చరిత్రలో తొలిసారిగా డాలర్ విలువ భారీగా పెరిగి మన రూపాయిని వెక్కిరిస్తోంది. రూపాయి పతనం అనేది కేవలం కరెన్సీ మార్పు మాత్రమే కాదు, ఇది ఆర్థిక వ్యవస్థపై పడుతున్న తీవ్రమైన ఒత్తిడికి ఓ సంకేతం. అందుకే భవిష్యత్తులో రూపాయి ఏ స్థాయికి పడిపోతుందో అనే అందోళన అందరిలో మొదలయింది. ప్రస్తుత ఆర్థిక ఏడాదిలోనే రూపాయి విలువ ఇప్పటివరకు దాదాపు పదిశాతం మేర క్షీణించింది. 2014 తర్వాత రూపాయికి ఇదే అత్యంత దారుణమైన పతనం. ఆ ఏడాది 9.4 శాతం పడిపోగా, ఇప్పుడు ఆ రికార్డును కూడా దాటేసింది. నిజం మాట్లాడుకోవాలంటే గడిచిన పద్నాలు గేండ్లలో కేవలం రెండు సార్లు మాత్రమే రూపాయి పుంజుకుంది, మిగిలిన అన్ని ఏండ్లలో పతనాన్నే చవిచూసింది. రూపాయి అంటే కేవలం ఓ నాణెం మాత్రమే కాదు. దేశంలోని కోట్లాది మంది జీవితం. దాని విలువ పైసా పడిపోయినా పేదల జీవితాలు తలకిందులై పోతాయి. ధరలు విపరీతంగా పెరిగిపోతాయి. కానీ, సామాన్యుల సమస్యలేవీ మన పాలకులకు పట్టవు. సామ్రాజ్య వాదులకు వత్తాసు పలకడం, కార్పొరేట్లకు సలామ్‌లు కొట్టడం తప్ప రూపాయి విలువ కాపాడేందుకు మోడీ చేస్తున్న ప్రయత్నం శూన్యం. దానికి తాజా పరిస్థితులే ఉదాహరణ. ప్రస్తుత అంతర్జాతీయ ఉద్రిక్తతలు, విదేశీ పెట్టుబడుల ఉపసంహా రణతో మన రూపాయి విలువ రికార్డు స్థాయిలో పడిపోయింది. దీనికి తోడు క్రూడాయిల్ ధరలు పెరగడం మరింత ఆందోళనకరంగా మారింది. ప్రపంచ మార్కెట్‌లో డాలర్ జోరు, దేశీయ మార్కెట్ల నుంచి విదేశీ పెట్టుబడుల ఉపసంహరణ రూపాయిని కోలుకోలేని దెబ్బతీశాయి. అమెరికా-ఇరాన్ మధ్య నెలకొన్న యుద్ధ పరిస్థితుల వల్ల అంతర్జాతీయంగా అనిశ్చితి నెలకొంది. సూటిగా చెప్పాలంటే ఈ యుద్ధం మొదలైనప్పటి నుంచి రూపాయి సుమారు 3.4 శాతం నష్టపోయింది. ఈ కారణంగా విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు (ఎఫ్‌పీఐఎస్) భారత మార్కెట్ల నుంచి భారీగా నిధులను వెనక్కి తీసుకుంటున్నారు. ఇది మన ఆర్థిక వ్యవస్థకు తీవ్రమైన నష్టం. ఈ ఏడాది ప్రారంభం నుంచి ఇప్పటివరకు ఏకంగా రూ.1,07,077 కోట్లు వెనక్కి వెళ్లిపోయాయంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. మన దేశానికి దాదాపు ఎనభై శాతం చమురు విదేశాల నుంచే వస్తుంది. ఈ నెలలోనే క్రూడాయిల్ ధరలు 50 శాతానికి పైగా పెరిగాయి. దీనితో పాటు రూపాయి బలహీనపడటం వల్ల ఇంధన ధరలు పెరిగే అవకాశం ఉంది. రూపాయి విలువ పడిపోవడమంటే విదేశాల నుంచి మనం కొనుగోలు చేసే వస్తువుల ధరలు పెరగడమే. మనం విదేశాల నుంచి దిగుమతి చేసుకునే పెట్రోల్, గ్యాస్‌తో పాటు ఎలక్ట్రానిక్ వస్తువులకు ఎక్కువ చెల్లించాల్సి వస్తుంది. పెట్రోల్ ధరలు పెరిగితే రవాణా ఖర్చులు పెరుగుతాయి. దీని ప్రభావంతో నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటుతాయి. అంతేకాదు ముడి సరుకుల ధరలు పెరగడం వల్ల దేశీయ కంపెనీలపై కూడా ప్రతికూల ప్రభావం పడటం ఖాయం. రూపాయి పతనంతో ముడిచమురు ధరలు పెరగడం వల్ల ద్రవ్యోల్బణం పెరిగి, ఆర్థిక వృద్ధిపై తీవ్ర ప్రభావం చూపుతుంది. మరోవైపు రూపాయిని ఆదుకునేందుకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రయత్నాలు చేస్తానంటోంది. కానీ ఆచరణలో మాత్రం చర్యలు శూన్యం. దీనికి తోడు అంతర్జాతీయ పరిణామాలు అనుకూలించక పోవడంతో రూపాయిపై ఒత్తిడి మరింత పెరిగింది. మొత్తానికి అగ్రరాజ్య అమెరికా అహంకారానికి మన రూపాయి కొవ్వొత్తిలా కరిగిపోతోంది. మన "నాయకుడు' మాత్రం యుద్ధ విన్యాసాలను చూస్తూ, అమెరికాకు గులాంగిరి చేస్తూ కాలం గడుపుతున్నాడు. యుద్ధం ఎక్కడ జరిగినా దాని ప్రభావం ప్రపంచ వ్యాప్తంగా ఉంటుంది. దాని పర్యావసానాలు అనుభవించేది సామాన్యులే. ఇది చరిత్ర చెబుతున్న సత్యం. ఆ యుద్ధ ప్రభావమే నేడు మన రూపాయిపై కూడా పడింది. పతనానికి కారణమయింది. నేడు ఇంట్లో వండుకునేందుకు కూడా గ్యాస్ దొరక్క చాలామంది గ్యాస్ కంపెనీల వద్ద క్యూలు కడుతు న్నారు. చిరు వ్యాపారులు, టిఫిన్ సెంటర్ల వారైతే దుకాణాలు మూసేసుకుని అల్లాడుతున్నారు. దీనంతటికి కారణం ముమ్మాటికీ అమెరికా దురహంకారమే. దానికి వత్తాసు పలుకుతున్న మన కేంద్ర పాలకుల నిర్వాకమే.



# దక్షిణాది రాష్ట్రాలు పోరాటానికి సిద్ధం కావాలి

మొదటి తరువాయి

ఇప్పటికే కేంద్రంలో దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యం తక్కువగా ఉందని తెలిపారు. మోడీ అధికారంలోకి వచ్చాక బీజేపీ అగ్రనేత వెంకయ్యనాయుడిని ఢిల్లీ నుంచి ఖాళీ చేయించారని గుర్తుచేశారు. ఉత్తరాది రాష్ట్రాల్లో సీట్ల పెంపుతో దక్షిణాది రాష్ట్రాల అవసరం లేకుండా కేంద్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేసుకునే అవకాశం ఉంటుందన్నారు. అలాగైతే జాతీయ రాజకీయాల్లో దక్షిణాది రాష్ట్రాల నేతలకు చోటు లేకుండా పోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. జనాభా లెక్కల ఆధారంగా సీట్ల పెంపు జరిగినా దక్షిణాది రాష్ట్రాలకు తీవ్ర నష్టం జరుగుతుందని చెప్పారు. అన్ని పక్షాలతో చర్చ జరిపి సీట్ల పెంపుపై ముందుకెళ్లాలని సూచించారు. మొదటి నుంచీ దక్షిణాది రాష్ట్రాల ప్రయోజనాల విషయంలో కేంద్ర ప్రభుత్వం తీవ్ర వివక్ష చూపుతున్నదనీ, ఉత్తర, దక్షిణ భారతాలకి మధ్య అంతరాన్ని ఎన్డీఏ ప్రభుత్వం పెంచుతున్నదని విమర్శించారు. దక్షిణాది రాష్ట్రాల ఎన్నికల ప్రచారంలో ఈ అంశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్తామని చెప్పారు. తాను ఇంకా ఎనిమిదేండ్లు తెలంగాణ రాజకీయాల్లో ఉంటానని సీఎం చెప్పారు. తాను దేశ రాజకీయాల్లో పనిచేయాలా? వద్దా? అనేది పార్టీ



అధిష్టానం నిర్ణయిస్తుందని వ్యాఖ్యానించారు. మోడీ త్రీడీ పాలసీకి వ్యతిరేకంగా దక్షిణాదిని ఐక్యం చేయాల్సిన అవసరముందని నొక్కి చెప్పారు. దక్షిణాది నుంచి ఎన్నికైన వారికి కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. మొదటి నుంచీ బీజేపీలో ఉన్నవారిని పక్కకు ఎందుకు పెట్టారని నిలదీశారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు దక్షిణాది నేతలు రాష్ట్రపతులు అయ్యారని గుర్తుచేశారు. తమ పార్టీది ఇండియా అంతా ఒక్కటే అనే సిద్ధాంతం అని చెప్పారు. కానీ, మోడీ అధికారంలోకి వచ్చిన 12 ఏండ్లలో దక్షిణాదికి గుర్తింపు ఏదని ప్రశ్నించారు. రాజకీయ వివక్ష కొనసాగించడం బీజేపీకి వెన్నతో పెట్టిన విద్య అని విమర్శించారు. కేంద్ర మంత్రిత్వ శాఖల్లో, టాప్‌టెన్ పదవుల్లో ఒక్కటి కూడా దక్షిణాది నేతలకు ఎందుకు ఇవ్వలేదని నిలదీశారు. తమ నేత రాహుల్‌గాంధీ దేశం గురించి ఆలోచిస్తుంటే మోడీ, అమిత్‌షా అందుకు భిన్నంగా ప్రజలపై భారాలు మోపడంపై ఆలోచిస్తున్నారని ఎద్దేవా చేశారు. నిర్ణయాలు తీసుకున్న తర్వాత అన్ని పార్టీలనూ పిలవటం బీజేపీకి ఆనవాయితీగా మారిందని విమర్శించారు. పెట్టుబడులన్నింటినీ ప్రధాని మోడీ గుజరాత్‌కు తరలిస్తున్నారని ఆరోపించారు. తెలంగాణ కూడా ఈ దేశంలో భాగమేననే విషయాన్ని గుర్తించుకోవాలని సూచించారు. మంచి ఎక్కడ ఉన్నా స్వీకరిస్తామన్నారు. గుజరాత్‌లో సబర్మతీ నదిని ప్రక్షాళన చేసిన బీజేపీ హైదరాబాద్‌లో మాత్రం మూసీ ప్రక్షాళనను అడ్డుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. బీఆర్ఎస్ కూడా బీజేపీ బాటలోనే నడుస్తున్నదని విమర్శించారు. తాము అధికారంలోకి వచ్చిన నాటికే రాష్ట్రంలో అప్పులు విపరీతంగా పెరిగి ఖజానా ఖాళీ అయ్యిందని ఆందోళన వ్యక్తం చేశారు. అందుకే, అసెంబ్లీలో దీనిపై శ్వేతపత్రం విడుదల చేశామని తెలిపారు.

# మహిళా రిజర్వేషన్ పై అఖిలపక్షం ఏర్పాటు చేయాలి

- ప్రతిపక్షాలు డిమాండ్

న్యూఢిల్లీ మార్చి 24 నేటి దర్శిని,

మహిళా రిజర్వేషన్ చట్టానికి రాజ్యాంగ సవరణ తీసుకురావడానికి ముందు అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయి. కేంద్ర ప్రభుత్వం ఎలాంటి సవరణలు చేయాలనుకుంటుందో వివరిస్తూ, వెంటనే ఒక సవివరమైన నోట్‌ను సమర్పించాలని ప్రతిపక్ష పార్టీలు డిమాండ్ చేశాయి. పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజుకు రాసిన లేఖలో రాజ్యసభ ప్రతిపక్ష నాయకుడు మల్లికార్జున్ ఖర్గే, 'నారీ శక్తి వందన అధానియం' (106వ రాజ్యాంగ సవరణ)ను ఎలా అమలు చేయాలనుకుంటున్నారనే దానిపై ఒక స్పష్టమైన రోడ్‌మ్యాప్‌ను సిద్ధం చేయాలని, దానిపై వివరంగా



చర్చించాలని డిమాండ్ చేశారు. "జనాభా లెక్కలు, నియోజకవర్గాల పునర్విభజన వంటి ప్రక్రియలను పూర్తి చేయకుండానే వచ్చే ఏడాది మహిళా రిజర్వేషన్‌ను అమలు చేయాలన్నది ప్రభుత్వ చర్య. ఈ రాజ్యాంగ సవరణను ఆమోదింపజేయడంలో ప్రతిపక్షం సహాయపడాలని ఖర్గేను కిరణ్ రిజిజు కోరారు. దీనికి ప్రతిస్పందనగా, ప్రతిపక్ష వైఖరిని స్పష్టం చేస్తూ ఖర్గే మంత్రికి లేఖ రాశారు. రిజిజుతో పాటు, కేంద్ర హోం మంత్రి అమిత్ షా కూడా ఈ విషయంలో కొన్ని ప్రతిపక్ష పార్టీల మద్దతు కోరారు. అమిత్ షా, ఎంఐఎం నాయకుడు అసదుద్దీన్ ఒవైసి, ఎన్‌సిపి శరద్ పవార్ వర్గం నాయకుడు సుప్రియా సులే తదితరుల సహాయం కోరారు. ప్రతిపక్షాలతో ఎలాంటి ముఖ్యమైన చర్చలు జరపకుండా, వీలైనంత త్వరగా సవరణకు సంబంధించిన రెండు బిల్లులను పార్లమెంటులో ప్రవేశపెట్టాలన్నది కేంద్ర ప్రభుత్వం యోచిస్తోంది. కేంద్ర మంత్రివర్గం త్వరలో ఈ బిల్లులను ఆమోదించే అవకాశం ఉంది. శుక్రవారం నాటికి ఈ బిల్లులను ప్రవేశపెట్టాలని ఉద్దేశించినట్లు కేంద్ర ప్రభుత్వ వర్గాలు కూడా తెలిపాయి. అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయడానికి బదులుగా, ప్రతిపక్ష పార్టీ నాయకులతో ఒకరితో ఒకరు చర్చలు జరిపి మద్దతు కూడగట్టడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తోంది.

# సంక్షోభాన్ని ఎదుర్కొనేందుకు ప్రజలు సంపూర్ణంగా సిద్ధంగా ఉండాలి

- రాష్ట్ర ప్రభుత్వాలు కూడా చొరవ తీసుకోవాలి : ప్రధానమంత్రి నరేంద్ర మోడీ

న్యూఢిల్లీ : మార్చి 24 నేటి దర్శిని,

పశ్చిమ ఆసియా ఘర్షణల నేపథ్యంలో దేశం కోవిడ్ కాలం నాటి సంక్షోభం వంటి దీర్ఘకాలిక సంక్షోభం వైపు పయనిస్తోందని, దానిని ఎదుర్కొనేందుకు పౌరులు సంపూర్ణంగా సిద్ధంగా ఉండాలని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అన్నారు. దేశంలోని ఘర్షణల వల్ల ఏర్పడిన సంక్షోభం గురించి మంగళవారం ఆయన రాజ్యసభలో మాట్లాడారు. 'ఇంధన సరఫరా గొలుసులలో అంతరాయం, ధరల పెరుగుదల సుదూర పరిణామాలకు దారితీస్తాయి. యుద్ధం వల్ల కలిగే సంక్షోభం దీర్ఘకాలం కొనసాగుతుంది. ఈ సంక్షోభాన్ని ఎదుర్కొనేందుకు ప్రభుత్వం అన్ని విధాలా ప్రయత్నిస్తోంది. కోవిడ్-19 సంక్షోభాన్ని అధిగమించడానికి ఉన్నత స్థాయి బందాలను ఏర్పాటు చేశారు. అదేవిధంగా, యుద్ధకాల సంక్షోభాన్ని పరిష్కరించడానికి కూడా ఉన్నత స్థాయి బందాలను



ఏర్పాటు చేస్తారు. ఇంధనం, సరఫరా గొలుసులు, ఎరువుల పంపిణీ, ధరల పెరుగుదలను నియంత్రించడం వంటి అంశాలకు సంబంధించిన వ్యూహాలను ఈ బందాలు రూపొందిస్తాయి. ఈ సంక్షోభాన్ని అధిగమించేందుకు రాష్ట్ర ప్రభుత్వాలు కూడా చొరవ తీసుకోవాలి. అన్ని కష్టకాలంలో మాదిరిగానే, కార్మికులు, నిరుపేదలు ఎక్కువగా నష్టపోతారు. వారిని ఆదుకోవడానికి రాష్ట్రాలు సిద్ధంగా ఉండాలి. నల్లబజారు, నిల్వలను నివారించడానికి చర్యలు తీసుకోవాల" అని అన్నారు.

**హోర్ముజ్‌ను మూసివేయడం ఆమోదయోగ్యం కాదు**

మధ్యప్రాచ్యంలో వీలైనంత త్వరగా ఉద్రిక్తతలను తగ్గించడానికి, హోర్ముజ్ జలసంధిని తెరవడానికి కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు. 'మేము గల్ఫ్ దేశాల అధిపతులతో మాట్లాడుతున్నాము. ఇరాన్, ఇజ్రాయెల్, అమెరికాలతో సంప్రదింపులు జరుపుతున్నాము. దౌత్యపరమైన చర్చలతో ఈ ప్రాంతంలో శాంతి, ప్రశాంతతను నెలకొల్పేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. హోర్ముజ్‌ను మూసివేయడం ఆమోదయోగ్యం కాదు. దాని గుండా వెళ్లే వాణిజ్య నౌకలపై దాడులు ఖండనీయం. అదేవిధంగా, ఇంధన సౌకర్యాలపై దాడులను మేము వ్యతిరేకిస్తాము. సంఘర్షణ ప్రాంతాల్లోని భారతీయుల భద్రతకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోంది. 3,75,000 మంది భారతీయులు సురక్షితంగా తిరిగి వచ్చారు. 700 మంది వైద్య విద్యార్థులతో సహా 1,000 మంది ఇరాన్ నుంచి తిరిగి వచ్చారు. భారతదేశంలో తగినంత ముడి చమురు నిల్వలు ఉన్నాయి' అని అన్నారు.

# తగ్గిన విదేశీ పెట్టుబడులు

- కొత్తవి రావడం లేదు
- ఉన్నవి వెళ్లిపోతున్నాయి
- నికర ఎఫ్‌డిఐల్లో భారీ పతనం
- ఆర్‌బిఐ నివేదిక వెల్లడి

ముంబయి - మార్చి 24 నేటి దర్శిని,

భారత ఆర్థిక వ్యవస్థ బ్రహ్మాండంగా ఉందని, ఇక్కడ పెట్టుబడులు పెట్టడానికి విదేశీ పెట్టుబడిదారులు బారులు తీరుతున్నారంటూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న భారీ ప్రచారానికి క్షేత్ర స్థాయిలో వాస్తవాలకు పొంతన ఉండటం లేదు. రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) తాజాగా విడుదల చేసిన నివేదిక ప్రకారమే కొత్త విదేశీ పెట్టుబడుల రాక భారీగా తగ్గిపోగా, ఇప్పటికే దేశంలో ఉన్నవి సైతం వేగంగా వెనక్కి వెళ్లిపోతున్నాయి. దీంతో వరుసగా ఐదో




నెలయైన 2026 జనవరిలోనూ నికర విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల్లో భారీ పతనం చోటుచేసుకుంది. ఈ నెలలో భారత్‌లోకి వచ్చిన పెట్టుబడుల కంటే.. ఇక్కడి నుంచి విదేశాలకు వెళ్లిన పెట్టుబడులే ఏకంగా 1.4 బిలియన్ డాలర్లు (దాదాపు రూ.13వేల కోట్లు) ఎక్కువగా ఉన్నట్లు ఆర్‌బిఐ తేల్చింది. భారతీయ కంపెనీలు విదేశాల్లో పెట్టే పెట్టుబడులు 5.4 శాతం పెరిగి 2.1 బిలియన్ డాలర్లకు చేరాయి. అత్యధికంగా అమెరికా, సింగపూర్, బ్రిటన్, యుఎఇలకు భారత పెట్టుబడులు తరలిపోయాయిమరోవైపు భారత్‌లో వ్యాపారం చేస్తున్న విదేశీ కంపెనీలు తమ నిధులను వెనక్కి తీసుకోవడం లేదా పెట్టుబడుల ఉపసంహరణ ఏకంగా 97.3 శాతం పెరిగి 4.9 బిలియన్లకు చేరింది. ఫలితంగా నికర ఎఫ్‌డిఐ మైనస్ 1.4 బిలియన్లుగా నమోదయ్యింది. ఇది అక్టోబర్ 2025 తర్వాత అత్యంత తక్కువ స్థాయి. కొత్తగా వస్తున్న ప్రతి రూపాయి కంటే వెనక్కి వెళ్తున్న నిధులు దాదాపు రెట్టింపుగా ఉన్నాయని స్పష్టమవుతోంది. గత ఏడాది జనవరితో పోలిస్తే కొత్తగా వచ్చే స్థూల ఎఫ్‌డిఐల రాకలోనూ 7 శాతం క్షీణించి 5.7 బిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయి. ఇది అంతర్జాతీయ ఇన్వెస్టర్లలో భారత మార్కెట్‌పై అనాసక్తిని వెల్లడిస్తోంది.

## ఉమ్మడి వరంగల్ జిల్లాలో 16 కు పెరగనున్న అసెంబ్లీ స్థానాలు, 3ఎంపీ స్థానాలు...?

- 2029 లో ఉమ్మడి వరంగల్ జిల్లాలో 5 మహిళా ఎమ్మెల్యే లకు ప్రాతినిధ్యం దక్కే అవకాశం



**ఉమ్మడి వరంగల్ , మార్చి 24 (నేటి దర్శిని బ్యూరో):** ఉమ్మడి వరంగల్ జిల్లాలో ని ప్రస్తుత 12 అసెంబ్లీ స్థానాల నుంచి 16 అసెంబ్లీ స్థానాలు, 2 ఎంపీ స్థానాలు నుంచి 3 స్థానాలు పెరిగే అవకాశం ఉందని సమాచారం. 2029 ఎన్నికల నాటికి అసెంబ్లీ, పార్లమెంట్ నియోజకవర్గాల పునర్విభజన పూర్తి చేసేందుకు కేంద్రము సిద్ధమవుతోంది .ఇందులో భాగంగా ఉమ్మడి వరంగల్ జిల్లాలో అసెంబ్లీ ,పార్లమెంటు స్థానాలు పెరిగే అవకాశం ఉందని పరిశీలకులు భావిస్తున్నారు. అలాగే ప్రస్తుతమున్న అసెంబ్లీ, పార్లమెంటు రిజర్వేషన్లు పూర్తిగా మారే అవకాశం ఉందని, మహిళలకు రిజర్వ్ చేస్తారని పొలిటికల్ ప్రచారం కొనసాగుతుంది. పార్లమెంట్లో 33 శాతం మహిళా రిజర్వేషన్ బిల్లుకు మోక్షం లభిస్తే 2029 లో వచ్చే ఎన్నికల్లో ఉమ్మడి వరంగల్ జిల్లా రాజకీయం ఉత్తమ మలుపులు తిప్పుతుంది అసెంబ్లీ నియోజకవర్గాల పునరుల కోసం పెరిగే 16 అసెంబ్లీ స్థానాలు మహిళలకు నాలుగు నుంచి ఐదు స్థానాలు కేటాయించారు భావిస్తున్నారు .ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి ఐదుగురు మహిళా ఎమ్మెల్యేలు అసెంబ్లీలో అడుగుపెట్టే అవకాశం కనిపిస్తుంది. ప్రస్తుతం రిజర్వేషన్ అమలులో లేనప్పటికీ ముగ్గురు మహిళా ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం విశేషం. అందులో ఇద్దరు మంత్రులుగా వ్యవహరించడం ఉమ్మడి వరంగల్ జిల్లాకు ప్రత్యేక స్థానం ఉంది.

## వరంగల్ నగరంలో శ్రీ సీతారామ ఆంజనేయ అమ్మకానికి విగ్రహాలు



**ఉమ్మడి వరంగల్, మార్చి 24 (నేటి దర్శన బ్యూరో):** శ్రీరామనవమి పర్వదినం పురస్కరించుకొని వరంగల్ నగరములోని ప్రధాన రోడ్లపై శ్రీ సీతారామ ఆంజనేయ విగ్రహాలు విక్రయిస్తున్నారు. ఈనెల 27న శ్రీ సీతారామ కళ్యాణ మహోత్సవం జరగనుంది. ఈ సందర్భంగా వరంగల్ నగరంలోని శ్రీ భద్రకాళి దేవాలయం ఆర్చి ప్రాంతంలో హనుమకొండ కలెక్టర్ ఆఫీస్ ముందు, కాజీపేట మార్కెట్ ప్రాంతాలలో విగ్రహాలను అమ్ముతున్నారు. రూపాయలు 100 నుంచి 200 వరకు చిన్న సైజు విగ్రహాలు, రూపాయలు 500 నుంచి 1000 వరకు పెద్ద విగ్రహాలు విక్రయిస్తున్నారు. ఇండ్లలో పూజల కోసం చాలామంది విగ్రహాలను కొనుగోలు చేస్తున్నారు.

## రేపటి నుండి ఎన్‌జీఓస్ కాలనీ గ్రంథాలయ పనులకు శ్రీకారం: ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి హామీ




**ఎల్.బి.నగర్; మార్చి 24 (నేటి దర్శిని):** దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఎన్‌జీఓస్ కాలనీ గ్రంథాలయ నిర్మాణ పనులు రేపటి నుండి పునఃప్రారంభం కానున్నట్లు ఎల్‌బీ నగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి తెలిపారు. ఎన్‌జీఓస్ కాలనీ పెద్దలు, స్థానిక నివాసితులు లైబ్రరీ గ్రౌండ్‌లో నిర్వహించిన సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కాలనీవాసులు గ్రంథాలయ పనులు వెంటనే ప్రారంభించాలని ఎమ్మెల్యేను కోరారు. దీనికి స్పందించిన ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, గ్రంథాలయ పనులను తాను ఎప్పుడూ ఆపలేదని, కొందరు బీజేపీ కార్పొరేటర్ల దుందుడుకు చర్యల వల్లే పనులు నిలిచిపోయాయని పేర్కొన్నారు. ఇకపై ఎటువంటి ఆటంకాలు లేకుండా పనులు కొనసాగించాలని అక్కడే ఉన్న ఇంజినీరింగ్ అధికారులకు (ఈఈ, డీఈ) ఆదేశాలు జారీ చేశారు.

రేపటి నుంచే పనులు ప్రారంభం కానున్న నేపథ్యంలో కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కాలనీ పెద్దలు ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, బీఎన్ రెడ్డి నగర్ డివిజన్ భారస పార్టీ అధ్యక్షుడు కటికరెడ్డి అరవింద్ రెడ్డిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌జీఓస్ కాలనీ పెద్దలు సోమయాజులు, పంపన్న వెంకటేశ్వర్, శివనాగేశ్వర్ రావు, వేముల జైపాల్ రెడ్డి, వర్ధని, శశిధర్ రెడ్డి, ఓంప్రకాష్, భూషణ్, విశ్వనాథం, శ్యాంకుమార్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు. అలాగే మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ అనిల్ చౌదరీ, యూత్ అధ్యక్షుడు మునగాల రాఘవేందర్ రావు, కొంగర మహేష్, నీళ్ల రాజశేఖర్ గౌడ్, నరేందర్ గౌడ్, శ్రీకాంత్ రెడ్డి, అమర్త్య రెడ్డి తదితరులు హాజరయ్యారు.

## బస్సు ప్రయాణంలో టెన్త్ మెమో గల్లంతు

- తిరిగి ఇవ్వాలని విద్యార్థి వేడుకోలు


Board of Secondary Education
TELANGANA STATE, INDIA
SECONDARY SCHOOL CERTIFICATE

**చింతపల్లి, మార్చి 24 నేటి దర్శిని ప్రతినిధి :** బస్సు ప్రయాణంలో ఓ విద్యార్థి తన పదో తరగతి మెమోను కోల్పోయిన ఘటన చింతపల్లి మండలంలో చోటుచేసుకుంది. మండల పరిధిలోని కుర్మేడు గ్రామానికి చెందిన సందగల్ల నవదీప్ ఈ ఘటనపై ఆందోళన వ్యక్తం చేస్తున్నాడు. చింతపల్లి నుంచి కుర్మేడు గ్రామానికి బస్సులో ప్రయాణిస్తున్న సమయంలో తన ఎస్సెస్సీ మెమో మిస్సైనట్లు నవదీప్ తెలిపారు. ప్రయాణం ముగిసిన అనంతరం తన వద్ద మెమో లేకపోవడం గమనించిన ఆయన, బస్సులో లేదా మార్గమధ్యంలో ఎక్కడో పడిపోయి ఉండొచ్చని అనుమానం వ్యక్తం చేస్తున్నారు.పదో తరగతి మెమో విద్యార్థి భవిష్యత్తుకు అత్యంత ముఖ్యమైన పత్రం కావడంతో, ఈ ఘటనపై ఆయన తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఎవరైనా ఆ మెమోను కనుగొన్నట్లయితే దయచేసి తిరిగి అందజేయాలని లేదా సమీప పోలీస్ స్టేషన్‌కు అప్పగించాలని బాధితుడు విజ్ఞప్తి చేశాడు. మెమో దొరికిన వారు సహృదయంతో స్పందించి విద్యార్థికి అందజేస్తే అతని విద్యాభవిష్యత్తుకు ఎంతో మేలు జరుగుతుందని స్థానికులు పేర్కొన్నారు.

## పెద్ద మునిగల్ ఎస్టీ నియోజకవర్గం పునరుద్ధరణకు డిమాండ్

- గిరిజన హక్కుల కోసం పోరాటం కొనసాగిస్తాం కేతావత్ బాబురామ్ నాయక్



**నల్గొండ జిల్లా మార్చి 24 నేటి దర్శిని ప్రతినిధి :** చారిత్రక ప్రాధాన్యం కలిగిన పెద్ద మునిగల్ (ఎస్టీ) రిజర్వ్ నియోజకవర్గాన్ని తిరిగి పునరుద్ధరించాలని రైట్ టు ఇన్ఫర్మేషన్ సర్వీస్ సొసైటీ (ఆర్టీఐఎస్ఎస్) ఫౌండర్, నేషనల్ ప్రెసిడెంట్ కేతావత్ బాబురామ్ నాయక్ డిమాండ్ చేశారు.నల్గొండ జిల్లా పశ్చిమ ప్రాంత గిరిజన తండాల రాజకీయ భవిష్యత్తు, సమగ్ర అభివృద్ధి దృష్ట్యా ఈ నిర్ణయం అత్యవసరమని ఆయన పేర్కొన్నారు. 1950--60 దశకాల్లో పెద్ద మునిగల్ స్వతంత్ర రాజకీయ కేంద్రంగా, శక్తివంతమైన నియోజకవర్గంగా ఉన్న చరిత్రను ఆయన గుర్తు చేశారు. నాగార్జున సాగర్ ప్రాజెక్టు నిర్మాణం కోసం ఈ ప్రాంత గిరిజనులు వేలాది ఎకరాల భూములు, తమ పూర్వీకుల ఆవాసాలను త్యాగం చేశారని చెప్పారు. ప్రాజెక్టు ముంపు కారణంగా ప్రజలు చెదరిపోవడం నేపథ్యంలో 1970లలో జరిగిన పునర్విభజనలో పెద్ద మునిగల్ నియోజకవర్గ హోదా రద్దు చేయడం గిరిజనులకు జరిగిన చారిత్రక అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం దేవరకొండ, నాగార్జున సాగర్ నియోజకవర్గాల్లో విభజించబడిన చందంపేట, నేరడుగొమ్ము, డిండి (గుండ్లపల్లి), పెద్ద మునిగల్ మండలాలను ఏకం చేసి పెద్ద మునిగల్ కేంద్రంగా కొత్త ఎస్టీ రిజర్వ్ నియోజకవర్గాన్ని ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. ఈ మండలాల్లో 65 శాతం పైగా గిరిజన జనాభా ఉన్నందున రాజ్యాంగబద్ధంగా రిజర్వేషన్ కల్పించడం అవసరమని పేర్కొన్నారు.

దేవరకొండ నియోజకవర్గం విస్తీర్ణం ఎక్కువగా ఉండటంతో మారుమూల తండాల ప్రజలు చిన్న పనులకే 80 కిలోమీటర్ల దూరం ప్రయాణించాల్సి వస్తోందని, దీంతో పాలన ప్రజలకు చేరువ కావడం లేదని ఆయన వివరించారు. మా భూములిచ్చాం మా ఊర్లనిచ్చాం కానీ మా రాజకీయ ఉనికిని వదులుకోము అని స్పష్టం చేసిన బాబురామ్ నాయక్, పెద్ద మునిగల్ చారిత్రక హక్కులు తిరిగి సాధించే వరకు పోరాటం కొనసాగిస్తామని ప్రకటించారు. రాబోయే డీలిమిటేషన్ కమిషన్, రాష్ట్ర ప్రభుత్వం ఈ విన్నపాన్ని సానుకూలంగా పరిశీలించి పెద్ద మునిగల్‌ను కొత్త ఎస్టీ నియోజకవర్గంగా ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు.

## జెడ్పీటీసీ,ఎంపీటీసీ ఎన్నికల్లో ఐక్య నిర్ణయం అవసరం





- మార్చి 31లోగా సభ్యత్వం పూర్తి - ఏప్రిల్ 1 నుంచి 10 వరకు నిధి సేకరణ

**చింతపల్లి, మార్చి 24 నేటి దర్శిని ప్రతినిధి :** రాబోయే జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో ఎవరికి మద్దతు ఇవ్వాలన్న అంశంపై పార్టీ కార్యకర్తలు కలిసికట్టుగా నిర్ణయం తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే ఉజ్జిని యాదగిరి రావు సూచించారు. చింతపల్లి మండలంలోని సీపీఐ పార్టీ కార్యాలయంలో వేముల బుచ్చయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన మండల కౌన్సిల్ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.గత ఎన్నికల్లో కార్యకర్తలు ఏకతాటిపై లేకపోవడం, ఒకే నిర్ణయానికి రాకపోవడం వల్ల కొన్ని గ్రామపంచాయతీ, సాధారణ ఎన్నికల్లో పార్టీకి ఓటమి ఎదురైందని ఆయన గుర్తు చేశారు. ఈసారి అలాంటి పరిస్థితి రాకుండా ముందుగానే స్పష్టమైన నిర్ణయం తీసుకుని పార్టీ విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. మండల కార్యదర్శి పోలే వెంకటయ్య, సహాయ కార్యదర్శి ఉజ్జిని అంజాలరావు మాట్లాడుతూ మార్చి 31వ తేదీ లోపు పార్టీ సభ్యత్వ నమోదు పూర్తి చేయాలని సూచించారు. అలాగే ఏప్రిల్ 1 నుంచి 10వ తేదీ వరకు పార్టీ నిధి సేకరణ చేపట్టనున్నట్లు తెలిపారు. నిధి సేకరణలో ప్రతి కార్యకర్త ముందుండి సహకరించాలని కోరారు.ఈ సమావేశంలో మండల కార్యవర్గ సభ్యులు కోడిదాల వెంకటయ్య, పల్లపు లక్ష్మయ్య, షేక్ శంశోద్దీన్, మండల కౌన్సిల్ సభ్యులు ఇస్లావత్ పాప, ముద్దం దశరథ, చేపూరి వెంకటేష్, ఘనిపల్లి జితేంద్ర, ఘనిపల్లి రాములు, యాచారం శ్రీశైలం, కానూరు వీరయ్య, ముదిగొండ లక్ష్మయ్య, గుండ్లపల్లి ఇద్దీ రాములు, వింజమూరి నరసింహ, కలకొండ వెంకటయ్య, ముస్కు వెంకటయ్య, బాదం మల్లేష్, క్రిష్టాఫర్, రామకృష్ణ, మెరుగు సత్తయ్య, పోలోజు బ్రహ్మాచారి, శెట్టిపల్లి సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ భూముల సంరక్షణకు చర్యలు తీసుకోండి

- ఉప్పల్ ఎమ్మార్వోకు వినతి పత్రం ఇచ్చిన మాజీ కార్పొరేటర్ నాయకోటి పవన్ కుమార్




**కొత్తపేట, మార్చి24 (నేటి దర్శిని):** కొత్తపేట డివిజన్ పరిధిలోని ప్రభుత్వ భూములను గుర్తించి, వాటికి తక్షణమే ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని కోరుతూ మాజీ కార్పొరేటర్ నాయకోటి పవన్ కుమార్ ఉప్పల్ మండల ఎమ్మార్వో పూల్ సింగ్ చౌహాన్ గారికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా పవన్ కుమార్ మాట్లాడుతూ, ప్రభుత్వ భూములు ప్రజా అవసరాల కోసం కేటాయించబడినవని, వాటిని అక్రమ ఆక్రమణల నుండి కాపాడడం అత్యంత అవసరమని పేర్కొన్నారు. భూములను సకాలంలో గుర్తించి ఫెన్సింగ్ ఏర్పాటు చేస్తే, భవిష్యత్‌లో ప్రజా ప్రయోజనాల కోసం వాటిని సంరక్షించుకోవచ్చని తెలిపారు. అదేవిధంగా, ఈ సమస్యను ప్రాధాన్యంగా పరిగణించి సంబంధిత అధికారులకు తక్షణ ఆదేశాలు జారీ చేయాలని ఎమ్మార్వోను కోరినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు వెంకట్ రెడ్డి, తిరుమల, వీరా రెడ్డి, నాయకోటి ప్రదీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలులో

● వరంగల్ కు జరుగుతున్న అన్యాయం పట్ల పార్లమెంట్ లో ప్రశ్నించిన వరంగల్ ఎంపీ



**ఉమ్మడి వరంగల్, మార్చి 24 (నేటి దర్శిని బ్యూరో):** గ్రామీణ కుటుంబాలకు ఉపాధి కల్పించాల్సిన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలులో జరుగుతున్న లోపాలపై లోక్‌సభలో వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య ప్రశ్నించారు.ఈ పథకం కింద 125 రోజుల వరకు ఉపాధి కల్పించే అవకాశం ఉన్నప్పటికీ, వరంగల్ జిల్లాలో ఆ లక్ష్యం సాధనలో తీవ్ర వైఫల్యం ఉన్నదని ఎంపీ పేర్కొన్నారు. 2023-24 సంవత్సరంలో 100 రోజులకు పైగా ఉపాధి పొందిన కుటుంబాలు కేవలం 42 మాత్రమే ఉండగా, 2024-25లో అది మరింత తగ్గి 29 కుటుంబాలకు పరిమితమైందని వెల్లడించారు. ఈ సంఖ్యలు రాష్ట్రం,దేశ సగటుతో పోలిస్తే చాలా తక్కువగా ఉన్నాయని ఎంపీ డాక్టర్ కడియం కావ్య ఆవేదన వ్యక్తం చేశారు.జిల్లాలో నీటి సంరక్షణ, ఫార్మ్ పాండ్లు, చెక్‌డ్యామ్‌లు, సాగునీటి, భూగర్భ జలాల పునరుద్ధరణకు సంబంధించిన పనులు చేపట్టినప్పటికీ,గత రెండేళ్లలో 5,348 పనులు పూర్తయ్యి రూ.65 కోట్లకు పైగా వ్యయం జరిగినప్పటికీ,గ్రామీణ కుటుంబాలకు సరిపడ ఉపాధి కల్పించడంలో అసలు లక్ష్యం నెరవేరలేదని ఎంపీ గారు పేర్కొన్నారు. 2025లో తీసుకొచ్చిన వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్గార్ అండ్ అజీవిక మిషన్ (గ్రామీణ) చట్టం కింద 125 రోజుల ఉపాధి హామీ అమలు ఇంకా ప్రారంభం కాలేదని ఎంపీ తెలిపారు. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం వెంటనే ఈ హామీని అమలు చేయాలని, తెలంగాణలో పెండింగ్ వేతనాలను తక్షణమే చెల్లించాలని డా. కడియం కావ్య డిమాండ్ చేశారు.దీంతో వరంగల్ జిల్లాలోని గ్రామీణ కుటుంబాలకు అదనపు పనిదినాలు, సమయానికి వేతనాలు లభించి జీవనోపాధి మెరుగుపడుతుందని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య స్పష్టం చేశారు.

# అసెంబ్లీ ముట్టడికి అడ్డుకట్ట ముందస్తు అరెస్టులపై ఆగ్రహం

● ప్రజాస్వామ్యానికి విరుద్ధం ఇరగదిండ్ల కృష్ణ




**దేవరకొండ మార్చి 24 నేటి దర్శిని ప్రతినిధి :** అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి వెళ్లకుండా పోలీసులు ముందస్తు అరెస్టులకు పాల్పడటం ప్రజాస్వామ్య విరుద్ధమని దేవరకొండ నియోజకవర్గ వడ్డెర సంఘం అధ్యక్షుడు ఇరగదిండ్ల కృష్ణ తీవ్రంగా ఖండించారు.మంగళవారం ఉదయం సుమారు 7 గంటల సమయంలో ఆయన తన నివాసం నుంచి అసెంబ్లీ ముట్టడికి బయలుదేరుతుండగా పోలీసులు అక్కడికి చేరుకుని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించి, గంటసేపు అక్కడే ఉంచి వివరాలు నమోదు చేసి, ఫోటోలు తీసుకున్న తర్వాత విడుదల చేశారు. ఈ సందర్భంగా ఇరగదిండ్ల కృష్ణ మాట్లాడుతూ, శాంతియుతంగా నిరసన తెలిపే హక్కును ప్రభుత్వం కాలరాస్తోందని ఆరోపించారు. ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లకుండా పోలీసుల ద్వారా అణచివేయడం సరికాదన్నారు. ముందస్తు అరెస్టులతో తమ పోరాటాన్ని ఆపలేరని, హక్కుల సాధన కోసం నిరంతరం పోరాడతామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వడ్డెర సంఘం నాయకులు, కార్యకర్తలు పాల్గొని పోలీసుల తీరుపై నిరసన వ్యక్తం చేశారు.

# రెడ్లందరూ ఒకటే... రెడ్డి సంఘం ఒక్కటే







● చైర్మన్ గా బద్దూరి వెంకటేశ్వర్ రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నిక

**ఎల్బీనగర్, మార్చి 24 (నేటి దర్శిని):** హైదరాబాద్ నాగోల్ ప్రాంతంలో పిఎంఆర్ ఫంక్షన్ హాల్ లో ఏర్పాటు చేసిన రాష్ట్ర రెడ్డి సంఘాల ఆధ్వర్యంలో బద్దూరి వెంకటేశ్వర రెడ్డి అధ్యక్షతన నూతన హడ్ హాక్ కమిటీ ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సమావేశంలో రెడ్ల భవిష్యత్తు, భద్రత, ఆర్థిక, రాజకీయ, అసమానతలు ఎదురవుతున్న ఇబ్బందుల దృశ్యా మంగళవారం అన్నీ సంఘాలు కూడా ఏక వాక్య తీర్మానంతో ఒకే సంఘాన్ని రాష్ట్రంలో ఒకటే రెడ్డి సంఘం ఉండాలనే నినాదంతో అందరూ కలిసికట్టుగా ముందుకు వచ్చి ఈ యొక్క సాహసోపేతమైన నిర్ణయం తీసుకోవడం చారిత్రాత్మకమని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఉన్న పేద రెడ్లకు, పేద రెడ్డి విద్యార్థులకు మేమున్నామని ఈ కమిటీ ద్వారా ప్రతి ఒక్కరికి కూడా భవిష్యత్తు కోసం వారికి భరోసా ఇవ్వడం జరుగుతుంది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేసి పాలక వర్గంతో పాటు బడ్జెట్ కూడా కేటాయించాలని ఈ సందర్భంగా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేయడం జరిగింది. తెలంగాణ రాష్ట్రంలో ఆయా సామాజిక వర్గ ప్రజలకి రాష్ట్ర స్థాయిలో ఏదైతే ప్రభుత్వాలు వారికి హైదరాబాద్ నడిబొడ్డున కుల భవనాలు నిర్మించి ఇచ్చిందో అదే విధంగా తెలంగాణ రాష్ట్ర రెడ్ల కోసం పది ఎకరాల స్థలాన్ని కేటాయించి భవన నిర్మాణానికి నిధులు కేటాయించాలని ఈ సందర్భంగా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేయడం జరిగింది.రానున్న రోజుల్లో రెడ్ల సంక్షేమం కోసం ప్రభుత్వానికి, పేద రెడ్లకు మధ్యలో వారధిగా ఉండి పేద రెడ్ల సంక్షేమానికి ముందు ఉంటామని కొత్తగా ఏర్పడిన కార్యవర్గం ఈ సందర్భంగా శపథం చేశారు. రాష్ట్ర అడ్ హాక్ కమిటీ చైర్మన్ గా బద్దూరి వెంకటేశ్వర రెడ్డి కన్వీనర్ బుట్టెంగారి మాధవరెడ్డి, కో కన్వీనర్లుగా నల్లవెల్లి కరుణాకర్ రెడ్డి, కొట్టం మధుసూదన్ రెడ్డి, వసంత రెడ్డి, నూకల పద్మ రెడ్డి, గంగుల శ్రీలత రెడ్డి, నందికొండ గీతారెడ్డి సభ్యులుగా ఎన్నెపల్లి లింగారెడ్డి, ఎలిమినేటి సుమన్ రెడ్డి, సలహా దారులుగా ఏనుగు సంతోష్ రెడ్డి, పిట్టా శ్రీనివాస్ రెడ్డి, గోపు జైపాల్ రెడ్డి, నల్ల సంజీవరెడ్డి, నావల్గా సత్యనారాయణ రెడ్డి, బొక్క భూపాల్ రెడ్డి, బొబ్బిలి దామోదర్ రెడ్డి నియమించబడ్డారు.

# గ్యాస్‌పై అధిక వసూళ్లు చేస్తే కేసులు తప్పవు

● సాయి దుర్గ ఏజెన్సీపై అధికారుల నిలదీత



**మునుగోడు మార్చి 24 నేటి దర్శిని ప్రతినిధి :** గ్యాస్ సిలిండర్లకు నిర్ణీత ధర కంటే ఎక్కువ వసూలు చేస్తే క్రిమినల్ కేసులు నమోదు చేయడం ఖాయమని పౌర సరఫరాల శాఖ ఎన్ఫోర్స్మెంట్ డిప్యూటీ తహసీల్దార్ మాచన రఘునందన్ హెచ్చరించారు. నల్గొండ జిల్లా మునుగోడులో గ్యాస్ ధరలపై వచ్చిన ఫిర్యాదుల మేరకు ఆయన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా అధిక ధరలు వసూలు చేస్తున్న సాయి దుర్గ గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులను ఆయన నిలదీశారు. గరిష్ట చిల్లర ధరకు మించి వసూలు చేసే గ్యాస్ మాఫియాపై ఫిర్యాదులు వస్తే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. వేసవి ఎండల్లో వినియోగదారులను నిరీక్షింపజేయడం సరికాదని ఆయన పేర్కొన్నారు. గ్యాస్ సిలిండర్లు డోర్ డెలివరీ కావడం లేదని, అదనపు వసూళ్లు చేస్తున్నారని పలువురు వినియోగదారులు ఆరోపించడంతో వారి నుండి లిఖితపూర్వక ఫిర్యాదులు స్వీకరించారు. గ్యాస్ డెలివరీ సమయంలో తప్పనిసరిగా రశీదు తీసుకోవాలని, ఎక్కడైనా అధిక వసూళ్లు జరిగితే వెంటనే ఫిర్యాదు చేయాలని వినియోగదారులకు రఘునందన్ సూచించారు.

# అల్పాహారం, మజ్జిగ పంపిణీ చేసిన కృష్ణ గోపాల్ సేవా సమితి





**ఎల్.బి.నగర్,మార్చి24 (నేటి దర్శిని):** కృష్ణ గోపాల్ సేవా సమితి ఆధ్వర్యంలో నిరుపేద పిల్లలకు అల్పాహారం మరియు వేసవికాలంలో చల్లని మజ్జిగ అందించే కార్యక్రమంపై బాటసారులతో చర్చ జరిగింది. ఈ సందర్భంగా సమితి అధ్యక్షుడు కపిల్ కుమార్ అగర్వాల్ మాట్లాడుతూ, పిల్లలకు అల్పాహారం అందించడం ద్వారా తమ సంస్థ సభ్యులందరికీ ఎంతో సంతృప్తి కలుగుతుందని తెలిపారు. వేసవి వేడిని దృష్టిలో ఉంచుకొని చల్లని, రుచికరమైన మజ్జిగను అందించేందుకు సంస్థ అధికారులు అందరూ ఐక్యంగా సహకరిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. సమాజ సేవలో భాగంగా ఈ కార్యక్రమాన్ని మరింత విస్తరించాలని సంకల్పం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి సచిన్ అగర్వాల్, కోశాధికారి కుష్ అగర్వాల్, సంయుక్త కార్యదర్శి మనోజ్ గుప్తా, సభ్యులు సిద్ధార్థ్ పాల్చం పాకా, సతీష్ యాదవ్, సునీల్ దరాడే తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా నౌకాడ్ మురళీకృష్ణ, కె. నాగ్నాథ్, కె. లోకేష్, సి. నరోత్తమ్ కుమార్ మిత్రులు కూడా సహకారం అందించారు.నిరుపేద పిల్లల సంక్షేమం కోసం ఇలాంటి సేవా కార్యక్రమాలు కొనసాగించాలని స్థానికులు అభినందించారు.



# టీబి రహిత జిల్లాగా మార్చడానికి ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలి: కలెక్టర్




**ఉమ్మడి వరంగల్, మార్చి 24 (నేటి దర్శిని బ్యూరో):** హనుమకొండ జిల్లాను క్షయ వ్యాధి రహితంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ అన్నారు. ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవం సందర్భంగా జిల్లాలోని ఆత్మకూరు మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లో పరీక్షలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు ఈ కార్యక్రమంలో డి ఎం ఎస్ ఓ డాక్టర్ అప్పయ్య, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


# మైనర్ల డ్రైవింగ్‌పై పోలీసుల స్పెషల్ డ్రైవ్




**నిడమనూరు, మార్చి 24 (నేటి దర్శిని):** నిడమనూరు మండల పరిధిలో మైనర్ పిల్లలు వాహనాలు నడపకుండా నిరోధించేందుకు పోలీసులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా బైక్‌లు నడుపుతున్న 10 మంది మైనర్ బాలురను పోలీసులు పట్టుకున్నారు.హాలియా సిఐ డి. సతీష్ రెడ్డి, నిడమనూరు ఎస్సై ఉప్పు సురేష్ ఆధ్వర్యంలో ఈ డ్రైవ్ కొనసాగింది. పట్టుబడిన మైనర్ల తల్లిదండ్రులను పోలీస్ స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించారు. మైనర్ పిల్లలు వాహనాలు నడపడం ప్రమాదకరమని, ఇది చట్ట విరుద్ధమని అధికారులు తెలిపారు. ఇకపై మైనర్లు వాహనాలు నడిపితే తల్లిదండ్రులపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ స్పెషల్ డ్రైవ్ ద్వారా రోడ్డు ప్రమాదాలను తగ్గించడమే లక్ష్యమని పోలీసులు పేర్కొన్నారు.


# అసెంబ్లీ ముట్టడికి వడ్డెర సంఘం పిలుపు

- నిడమనూరు నుంచి భారీగా బయలుదేరిన నాయకులు



**నిడమనూరు, మార్చి 24 (నేటి దర్శిని):** రాష్ట్ర స్థాయిలో తమ హక్కుల సాధన కోసం వడ్డెర సంఘం నాయకులు అసెంబ్లీ ముట్టడికి నిడమనూరు మండలం నుండి భారీగా బయలుదేరారు. తెలంగాణ రాష్ట్ర వడ్డెర సంఘం అధ్యక్షుడు ఆయిల్ మల్లు ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం నిర్వహించినట్లు నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా నల్గొండ జిల్లా వడ్డెర సంఘం ఉపాధ్యక్షుడు రూపని రాములు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం వెంటనే వడ్డెర ఫౌండేషన్‌ను ఏర్పాటు చేసి కనీసం రూ.1000 కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. అలాగే వడ్డెర కులస్తులను ఎస్టీ జాబితాలో చేర్చాలని ప్రభుత్వాన్ని కోరారు. వడ్డెర వర్గానికి చెందిన ప్రజల అభివృద్ధి, సంక్షేమం కోసం ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని ఆయన పేర్కొన్నారు. ఈ ముట్టడితో తమ డిమాండ్లపై ప్రభుత్వం స్పందించాలని ఆశిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాగార్జునసాగర్ నియోజకవర్గం వడ్డెర సంఘం అధ్యక్షుడు గండికోట గోపీచంద్, రూపని లక్ష్మయ్య, కుంచం లక్ష్మయ్య, కుంచం నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

# జనన గణన ప్రక్రియలో టెక్నికల్ అసిస్టెంట్ల పాత్ర కీలకం: కలెక్టర్



**ఉమ్మడి వరంగల్, మార్చి 24 (నేటి దర్శిని బ్యూరో):** వరంగల్ ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో సెన్సెస్ క్లర్కులు, అసిస్టెంట్లకు మూడు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జనన గణన ప్రక్రియలో టెక్నికల్ అసిస్టెంట్ల పాత్ర అత్యంత కీలకమని అన్నారు. మే నెల 11 నుంచి జనన గణన ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. జనన గణన సమయంలో సాంకేతిక అంశాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

## సాగునీటి సమస్యలు పరిష్కరించాలని
# మంత్రిని కోరిన ఎమ్మెల్యే



**ఉమ్మడి వరంగల్, మార్చి 24 (నేటి దర్శిని బ్యూరో):** ఉమ్మడి వరంగల్ జిల్లా డోర్నకల్ నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ జాటోత్ రామచంద్రనాయక్ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డిని మంగళవారం హైదరాబాద్ అసెంబ్లీ చాంబర్లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డోర్నకల్ నియోజకవర్గంలో చెక్ డ్యాముల పునరుద్ధరణ, సాగునీటి కొరత వంటి కీలక అంశాలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు .సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించి సంబంధిత అధికారులతో సమీక్షించి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని ఎమ్మెల్యే తెలిపారు.

# శ్రీ సీతారామ స్వామి ఉత్సవ విగ్రహాలకు పంచామృత అభిషేకాలు...!



**ఉమ్మడి వరంగల్, మార్చి 24 (నేటి దర్శిని బ్యూరో):** వరంగల్ నగరంలోని కాశీబుగ్గలో ప్రసిద్ధిగాంచిన రంగనాయక స్వామి దేవాలయంలో శ్రీరామనవమి పురస్కరించుకొని సీతారామ ఉత్సవ విగ్రహాలకు పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. స్వామివారి కళ్యాణం అత్యంత వైభవంగా జరగాలని ప్రార్థించినట్లు భక్తులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈఓ వెంకట్రావు, ఆలయ అభివృద్ధి కమిటీ మాజీ అధ్యక్షులు వంగర రవి, అర్చకులు ఆరుట్ల కృష్ణమాచార్యులు భక్తులు పాల్గొన్నారు.

# హైదరాబాద్‌లో రాష్ట్ర మీడియా అక్రిడిటేషన్ కమిటీ సమావేశం

- అర్హులైన జర్నలిస్టులకు కార్డుల మంజూరు
- ఏప్రిల్ మొదటివారంలో తిరిగి సమావేశం కానున్న కమిటీ.



**హైదరాబాద్, మార్చి 24 (నేటి దర్శిని):** హైదరాబాద్‌లోని ఎఫ్‌డీసీ బోర్డు రూమ్‌లో ఈ రోజు రాష్ట్ర మీడియా అక్రిడిటేషన్ కమిటీ (ఎస్ఎంఏసీ -- స్టేట్ మీడియా అక్రిడిటేషన్ కమిటీ) సమావేశం జరిగింది. ప్రెస్ అకాడమీ, ఎస్ఎంఏసీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి, సమాచార--పౌర సంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్, ఎస్ఎంఏసీ కో-చైర్‌పర్సన్ సీహెచ్ ప్రియాంకతో కలిసి అక్రిడిటేషన్ కమిటీ సమావేశం నిర్వహించారు. అక్రిడిటేషన్ కోసం జర్నలిస్టులు సమర్పించిన దరఖాస్తులను కమిటీ సభ్యులు సమగ్రంగా పరిశీలించారు. జర్నలిస్టుల నుంచి అందిన ప్రతి దరఖాస్తును కమిటీ సభ్యులు క్షుణ్ణంగా పరిశీలించి, అర్హులైన జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులను మంజూరు చేశారు. ఈ సందర్భంగా కమిటీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం అర్హులైన వారికి అక్రిడిటేషన్ కార్డులు జారీ చేస్తామని, అర్హత కలిగిన ప్రతి జర్నలిస్టుకు కార్డు మంజూరులో ఎలాంటి లోపం ఉండదని స్పష్టం చేశారు. అక్రిడిటేషన్ కమిటీ సమావేశాన్ని వచ్చే నెల మొదటివారంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇంకా దరఖాస్తు చేసుకోని అర్హులైన జర్నలిస్టులు ఆన్‌లైన్ ద్వారా తమ దరఖాస్తులను సమర్పించాలని సూచించారు. జిల్లాల వారీగా కలెక్టర్లు పంపే 'జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ (డీఎంఏసీ)' ప్రతిపాదనలను కూడా పరిశీలించి ఆమోదం తెలుపుతుందని వెల్లడించారు. ఈ మేరకు జిల్లా స్థాయిలో అక్రిడిటేషన్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్లను కోరారు. సమాచార--పౌర సంబంధాల శాఖ డైరెక్టర్ కిషోర్ బాబు, అదనపు డైరెక్టర్ డి.ఎస్. జగన్ పాటు ఇతర కమిటీ సభ్యులు సమావేశంలో పాల్గొన్నారు.



# అనాథ పిల్లలకు ల్యాప్‌టాప్స్ పంపిణీ చేసిన బీఆర్ఎస్ నాయకుడు చంద్రశేఖర్ రెడ్డి

- సిఎస్ఆర్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ
- అనాథ బాలలకు ఆరు ల్యాప్‌టాప్స్, బ్యాగ్స్ అందజేత




**ఎల్బీనగర్, మార్చి 24 (నేటి దర్శిని):** అనాథ పిల్లల విద్యాభివృద్ధికి తోడ్పడే దిశగా ఫిన్ కర్వ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ / ఆగ్మాంట్ సంస్థ ఆధ్వర్యంలో సిఎస్ఆర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆదర్శ ఫౌండేషన్‌లోని అనాథ బాలురు, బాలికలకు ఆరు ల్యాప్‌టాప్స్ మరియు స్కూల్ బ్యాగ్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చైతన్యపురి బీఆర్ఎస్ పార్టీ నాయకుడు చంద్రశేఖర్ రెడ్డి హాజరై విద్యార్థులకు ల్యాప్‌టాప్స్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థుల భవిష్యత్తు నిర్మాణంలో విద్యా సామగ్రి కీలక పాత్ర పోషిస్తుందని, ఇలాంటి సేవా కార్యక్రమాలు సమాజానికి ఆదర్శంగా నిలుస్తాయని తెలిపారు. అలాగే, సమాజంలో వెనుకబడిన వర్గాలకు సహాయం చేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు సాయి కుమార్ రెడ్డి, శ్యామ్ సుందర్, ఆదర్శ ఫౌండేషన్ ఇంచార్జ్ ప్రదీప్, నాయకులు నరేందర్ రెడ్డి, జలంధర్, నరేష్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.




# పండిత్ దీన్ దయాల్ ఉపాధ్యాయ ప్రశిక్షణా మహా అభియాన్ 2026



**మిడ్జిల్, మార్చి24,(నేటి దర్శిని ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా బ్యూరో):** కొత్తకోట పట్టణం, కొత్తకోట గ్రామీణ, మదనాపురం, అడ్డాకుల, మండలలా ప్రశిక్షణా శిబిరంలో భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్ రామచందర్ రావు పాల్గొని దిశా నిర్దేశం చేయడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా ఎన్ రామచంద్రరావు గారితో పాటు ఓ శ్రీనివాస్ రెడ్డి, ప్రకాష్ రెడ్డి, విద్యాసాగర్ రెడ్డి, అయ్యగారి ప్రభాకర్ రెడ్డి, రాజ వర్ధన్ రెడ్డి, ముచ్చర్లపల్లి జనార్దన్ రెడ్డి, ప్రశిక్షణ తరగతుల జిల్లా గారి రమేష్ కుమార్, తదితరులు కార్యక్రమాన్ని ఉద్దేశించి ప్రసంగించారు.



# డాక్టర్ కొమరం లక్ష్మణరావు ని ఘనంగా సన్మానించిన ప్రజాప్రతినిధులు...



**మణుగూరు : మార్చి 24 (నేటి దర్శిని):** మండల వ్యవసాయ విస్తరణ అధికారి కొమరం లక్ష్మణరావు కి ఇటీవల డాక్టరేట్ ప్రధానోత్సవం జరిగిన సందర్భంగా మణుగూరు మండలం, గుట్ట మల్లారం గ్రామపంచాయతీ పరిధిలో గల రైతు వేదికలో డాక్టర్ కొమరం లక్ష్మణరావు ని ఘనంగా శాలువాతో సన్మానించి అభినందన
గుట్ట మల్లారం కట్టు మల్లారం సర్పంచులు కారం పూజ, జగడి ప్రసాద్, సమితి సింగారం గ్రామపంచాయతీ ఉపసర్పంచ్ గాండ్ల సురేష్, గుట్ట మల్లారం ఉపసర్పంచ్ మహేష్ లు .ఈ కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకులు బీ తాతారావు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కుర్రి చలపతిరావు, బొజ్జా త్రిమూర్తులు, ఎండి యాకూబ్ అలీ, తోటకూర గోపయ్య, కారం భద్రయ్య, ఎస్కే ఇస్మాయిల్ పాషా తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి

- జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్




**నారాయణఖేడ్,మార్చ్ 24 (నేటి దర్శిని):** క్షణికావేశంలో చేసిన తప్పులను సరిదిద్దుకునేందుకు లోక్ అదాలత్ ఒక మంచి అవకాశమని,ఈనెల 28న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్ ను జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సంగారెడ్డి జిల్లా ఎస్పీ పంకజ్ పరితోష్ అన్నారు.మంగళవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ..జిల్లా వ్యాప్తంగా నమోదై, చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న మరియు రాజీ కుదుర్చుకోవడానికి అవకాశం ఉన్న కేసులలో కక్షిదారులు పరస్పర అవగాహనతో రాజీ పడేందుకు లోక్ అదాలత్ దోహదపడుతుందని పేర్కొన్నారు.ఈ నెల 28న జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.క్రిమినల్ కంపౌండబుల్,సివిల్ వివాదాలు,ఆస్తి విభజన,కుటుంబ మరియు వైవాహిక వివాదాలు,బ్యాంకు రికవరీ,విద్యుత్ చౌర్యం,చెక్ బౌన్స్ తదితరాల్లో ఇరువర్గాల సమ్మతితో రాజీ కుదుర్చుకోవచ్చు అన్నారు.సైబర్ నేరాల విషయంలో బాధితులు కోల్పోయిన డబ్బులను తిరిగి పొందేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. రూ.25,000/- కంటే తక్కువ మొత్తాన్ని కోల్పోయిన సందర్భంలో లోక్ అదాలత్ లో ఫిర్యాదు చేసి,కోర్ట్ అనుమతితో ఎఫ్ఐఆర్ నమోదు చేయకుండానే రీఫండ్ ప్రక్రియను పూర్తి చేసుకునే అవకాశం ఉందన్నారు.జాతీయ లోక్ అదాలత్ విజయవంతం కావడానికి అధికారుల నుంచి కానిస్టేబుల్ వరకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, రాజీ పడదగిన కేసుల్లో ఇరువర్గాలకు కౌన్సిలింగ్ నిర్వహించి, ఎక్కువ సంఖ్యలో కేసులను పరిష్కరించాలని అన్నారు.లోక్ అదాలత్ ద్వారా వేగవంతమైన మరియు సులభమైన పరిష్కారం లభిస్తుందని ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.



## ఆ సినిమా చేసినందుకు నన్ను ట్రోల్ చేశారు..

నేను శైలజ సినిమాతో తెలుగు తెరకు పరిచయమైంది హీరోయిన్ కీర్తి సురేష్. తొలి సినిమాతోనే సూపర్ హిట్ అందుకున్న ఈ అమ్మడు.. ఆ తర్వాత మహానటి సినిమాతో ప్రేక్షకులకు మరింత చేరువయ్యింది. అలనాటి హీరోయిన్ సావిత్రి జీవితకథగా వచ్చిన ఈ చిత్రంలో మహానటి సావిత్రి పాత్రలో కీర్తి అద్భుతంగా నటించింది. తన నటనతో సావిత్రినే మరిపించి ఆడియన్స్ హృదయాల్లో మహానటిగా పేరు సంపాదించుకుంది.ఆ తర్వాత ఎన్నో సూపర్ హిట్ చిత్రాల్లో నటించి అగ్రకథానాయికగా వరుస హిట్లతో సక్సెస్ ఫుల్ గా రాణిస్తోంది. ప్రస్తుతం తెలుగు , తమిళ్ తో పాటు హిందీలోనూ సినిమాలు చేస్తుంది ఈ వయ్యారి భామ. గతంలో కీర్తిసురేష్ ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. తన ఫిల్మ్ కెరియర్.. సోషల్ మీడియాలో తనపై వచ్చే ట్రోల్స్ గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది కీర్తి సురేష్.ఆమె మాట్లాడుతూ.. మహానటి చిత్రాన్ని ఓకే చేసినందుకు తనను కొందరు ట్రోల్ చేశారని.. ఆ సినిమా పూర్తయ్యాకే ఈ విషయం తనకు తెలిసిందని చెప్పుకొచ్చింది. తనపై వచ్చిన విమర్శలు పక్కనపెడితే సావిత్రమ్మ పాత్రలో నటించినందుకు చాలా గర్వంగా ఉందన్నారు కీర్తి. “మహానటి చిత్రంలో నటించేందుకు ముందుగా ఒప్పుకోలేదు. సావిత్రమ్మ పాత్రలో నటించేందుకు చాలా భయమేసింది. కానీ దర్శకుడు నాగ్ అశ్విన్ నన్ను ప్రోత్సహించారు.నువ్వు చేయగలవు అనే ధైర్యనిచ్చారాయన. ఆయనకే అంత నమ్మకం ఉంటే.. నేను ఎందుకు భయపడాలి అనుకున్నాను. అలాగే మహానటి పూర్తిచేశా. ఆ పాత్రలోనటిస్తున్నందుకు కొంత మంది నన్ను ట్రోల్ చేశారు. ఆ విషయం నాకు తెలియదు. ఆ సినిమా ప్రమోషన్లలో పాల్గొన్నప్పుడు దీనిపై ప్రశ్న ఎదురైంది. అప్పుడు తెలిసింది నాపై ట్రోల్స్ వచ్చాయని.సోషల్ మీడియాలో నాపై వచ్చే నెగెటివిటీపై పెద్దగా ఆసక్తి చూపను. అందుకే నాపై ట్రోల్స్, విమర్శలు రావు. సావిత్రమ్మకు బయోపిక్ లో నటించడం భయంగా అనిపించింది. ఆమె కుమార్తెతో మాట్లాడి ఎన్నో విషయాలను తెలుసుకున్నాను. ఎన్నో సవాళ్లు ఎదురైనా కూడా ఆ పాత్ర చేసినందుకు మాత్రం గర్వపడుతున్నాను” అంటూ చెప్పుకొచ్చారు కీర్తి సురేష్.




# పెద్ది టీజర్ కోసం అభిమానుల ఆసక్తి

గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ నటిస్తున్న తాజా చిత్రం 'పెద్ది' పై రోజురోజుకూ అంచనాలు పెరుగుతున్నాయి. గ్రామీణ నేపథ్యంలో సాగే ఈ స్పోర్ట్స్ యాక్షన్ డ్రామాలో చరణ్ రఫ్ అండ్ మాస్ పాత్రలో కనిపించబోతున్నాడు. ఇటీవల విడుదలైన ఈ సినిమా రెండో సింగిల్ 'రై రై రా రా' సోషల్ మీడియాలో సంచలనం సృష్టించగా.. ముఖ్యంగా రామ్ చరణ్ ఎనర్జిటిక్ డ్యాన్స్ మూమెంట్స్ ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకున్నాయి. మరోవైపు ఈ సినిమా షూటింగ్ చివరి దశకు చేరుకుంది. ప్రస్తుతం గచ్చిబౌలి స్టేడియంలో క్రూషియల్ షెడ్యూల్‌తో బిజీగా ఉంది చిత్ర యూనిట్. నాలుగు రోజుల పాటు ఈ షెడ్యూల్ షూటింగ్ జరగనుందని సమాచారం. ఇక పెద్ది సినిమా నుంచి టీజర్ రిలీజ్‌కు రెడీ అవుతున్నారు మేకర్స్. అఫీషియల్ కన్ఫర్మేషన్ లేకపోయినా, రామ్ చరణ్ పుట్టినరోజు సందర్భంగా మార్చి 27న పెద్ది టీజర్ విడుదలయ్యే అవకాశం ఉంది. అయితే, చరణ్ బర్త్ డేకి మరో మూడు రోజుల సమయం మాత్రమే ఉంది. కానీ, ఇప్పటి వరకు పెద్ది టీమ్ నుంచి టీజర్ గురించి ఎలాంటి అప్డేట్ లేదు. మెగాభిమానులు మాత్రం ఈసారి తమ అభిమాన హీరో బర్త్ డేని గ్రాండ్‌గా సెలబ్రేట్ చేసుకోబోతున్నారు. మార్చి 26 సాయంత్రం నుంచి హైదరాబాద్ శిల్పకళా వేదికలో గ్రాండ్ ఈవెంట్ ఎ÷–లాన్ చేస్తున్నారు. ఈ వేడుకకు రామ్ చరణ్ అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొని గ్రాండ్ సక్సెస్ చేయడానికి సిద్ధమవుతున్నారు. పెద్ది చిత్రం ఏప్రిల్ 30న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుండగా.. నార్త్ అమెరికాలో మార్చి 26 నుంచి అడ్వాన్స్ బుకింగ్స్ ప్రారంభం కానున్నాయి. ఇక్కడి నుంచి పెద్ది సౌండ్ గట్టిగా ఉంటుందని నమ్ముతున్నారు మెగాభిమానులు.

# పెద్దితో చిందేయనుందా?



మృణాల్ ఠాకూర్ తెలుగులో మూడు సినిమాలు చేస్తే, వాటిలో రెండు విజయాలను అందుకున్నాయి. త్వరలో ఆమె ‘డెకాయిట్’ సినిమాతో మరోసారి తెలుగుప్రేక్షకుల్ని పలకరించనున్నది. రిలీజ్‌కు ముందే ఈ సినిమాపై పాజిటివ్ బజ్ క్రియేట్ అయింది. ఇందులో మృణాల్ పాత్ర కూడా సామాన్యంగా ఉండదట. బలమైన భావోద్వేగాలతో ఆమె పాత్రను తీర్చిదిద్దారట దర్శకుడు షానియల్ డియో. ఈ పాత్రతో ఆమె కెరీర్ మలుపు తిరగడం ఖాయమని ఇన్‌సైడ్ టాక్. ఇక బన్నీ, అట్లీ సినిమాల్లోనూ మృణాల్ నటిస్తున్నట్టు వార్తలొస్తున్నాయి. ఇదిలావుంటే.. తాజా సమాచారం ప్రకారం రామ్‌చరణ్ ‘పెద్ది’లో స్పెషల్ సాంగ్ చేసేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చేసిందట మృణాల్ ఠాకూర్. ఈ పాటలో జాన్వీ కపూర్ కూడా భాగం కానున్నదట. సినిమాకే ఈ పాట హైలైట్ అట. దీనిపై అధికారిక ప్రకటన త్వరలోనే రానుంది.



# శ్రీలీలకు వరుస ఫ్లాపులు.. ‘ఉస్తాద్ భగత్ సింగ్’ కూడా దెబ్బతీసినట్టేనా?

టాలీవుడ్‌లో సెన్సేషనల్ డెబ్యూతో ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించిన శ్రీలీల, చాలా తక్కువ కాలంలోనే స్టార్ హీరోల సరసన వరుస అవకాశాలు దక్కించుకుని బిజీ హీరోయిన్‌గా మారింది. తన డాన్స్, స్క్రీన్ ప్రెజెన్స్‌తో యూత్‌లో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ఈ బ్యూటీ, ప్రస్తుతం కెరీర్‌లో కాస్త కఠిన దశను ఎదుర్కొంటున్నట్లు కనిపిస్తోంది.‘భగవంత్ కేసరి’ వంటి కొన్ని సినిమాలు మినహా, ఆమె నటించిన చాలా చిత్రాలు బాక్సాఫీస్ వద్ద ఆశించిన ఫలితాన్ని ఇవ్వలేకపోయాయి. ఈ నేపథ్యంలో, తాజాగా విడుదలైన ఉస్తాద్ భగత్ సింగ్ సినిమాపై ఆమె భారీ ఆశలు పెట్టుకుంది. ఇందులో పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ హీరోగా నటించడం కూడా సినిమాకు హైప్‌ను తీసుకువచ్చింది.అయితే, సినిమా విడుదల తర్వాత పరిస్థితి ఆశించిన విధంగా లేకపోవడం గమనార్హం. విమర్శకుల నుంచి నెగిటివ్ టాక్ రావడంతో పాటు, బాక్సాఫీస్ వద్ద కూడా సినిమా ప్రదర్శన సంతృప్తికరంగా లేకపోవడం చిత్రబృందానికి నిరాశ కలిగిస్తోంది. ముఖ్యంగా, ఈ సినిమాలో శ్రీలీల పాత్రకు పెద్దగా ప్రాధాన్యత లేకపోవడం ప్రేక్షకులను నిరుత్సాహానికి గురిచేసింది. పవన్ కళ్యాణ్‌తో జోడీ విషయంలో సోషల్ మీడియాలో విపరీతమైన ట్రోలింగ్ జరుగుతోంది. క్యారెక్టర్ డిజైన్ సరైన స్థాయిలో లేకపోవడం, పెర్ఫార్మెన్స్‌కు పెద్దగా స్కోప్ లేకపోవడం వంటి అంశాలు విమర్శలకు దారి తీస్తున్నాయి. ఒకప్పుడు స్టార్ హీరోల సినిమాల్లో వరుసగా అవకాశాలు అందుకున్న శ్రీలీల, ఇప్పుడు తన ఫామ్‌ను తిరిగి అందుకోవడానికి కృషి చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.వీశీజఱవం ఇక, వరుస పరాజయాలు వచ్చినప్పటికీ, శ్రీలీల తన రెమ్యూనరేషన్ తగ్గించలేదన్న వార్తలు కూడా పరిశ్రమలో చర్చనీయాంశంగా మారాయి. దీనితో పలువురు నిర్మాతలు ఇతర హీరోయిన్లను ఎంపిక చేసుకునే దిశగా మొగ్గు చూపుతున్నారని సమాచారం. ప్రస్తుతం ఆమె చేతిలో పెద్దగా క్రేజీ ప్రాజెక్టులు లేకపోవడం కూడా ఆమె కెరీర్‌పై ప్రభావం చూపుతోంది. ఈ పరిస్థితుల్లో, శ్రీలీల ఇప్పుడు బాలీవుడ్‌పై దృష్టి సారించినట్లు టాక్ వినిపిస్తోంది. కొత్త అవకాశాల కోసం హిందీ చిత్రసీమలో ప్రయత్నాలు ప్రారంభించిందని సమాచారం. టాలీవుడ్‌లో తిరిగి తన స్థానాన్ని సంపాదించుకోవడానికి ఆమె ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటుందో చూడాలి.

# దురంధర్-2 కు రజనీకాంత్ ప్రశంసలు




తాజా బ్లాక్‌బస్టర్ 'ధురంధర్ 2'పై సూపర్‌స్టార్ రజనీకాంత్ ప్రశంసలు కురిపించారు. ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద సృష్టిస్తోన్న ప్రభంజనాన్ని చూసి.. ఆదిత్య ధర్ పనితీరును మెచ్చుకుంటూ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ఆదిత్యను 'బాక్సాఫీస్ కా బాప్' అని ప్రశంసించడమే కాకుండా సినిమా అద్భుతంగా ఉందని రజనీకాంత్ కొనియాడారు. ఈ సందర్భంగా హీరో రణవీర్ సింగ్, చిత్ర బృందానికి అభినందనలు తెలిపారు. ప్రతి భారతీయుడు చూడాల్సిన సినిమా అని అన్నారు. రజనీకాంత్ చేసిన ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. తలైవా పోస్ట్‌కు ఆదిత్య ధర్ ఎమోషనల్ రిప్లై పెట్టారు. ‘మేమందరం వినోదం అనే పదానికి మీ ఒక్కరినే బెంచ్‌మార్క్‌గా చూస్తూ పెరిగాము. దశాబ్దాలుగా మమ్మల్ని విజిల్స్ వేయించేలా, నవ్వించేలా, భావోద్వేగానికి గురయ్యేలా.. మీరు వినోదానికి అసలైన అర్థం చెప్పారు. ఇప్పటికీ అదే స్టైల్.. అదే గ్రేస్‌తో మీరు చేస్తున్న మ్యాజిక్ అద్భుతం. అలాంటిది మీరు 'ధురందర్ 2'ను తప్పక చూడాల్సిన చిత్రం అని చెప్పడం నా జీవితంలో అతిపెద్ద 'సూపర్‌స్టార్' మూమెంట్‌గా అనిపిస్తోంది. పెద్ద కలలు కనేలా మమ్మల్ని ప్రోత్సహించిన వ్యక్తి నుంచి అందిన ఈ ప్రశంస ఒక వరంలా ఉంది. మీ మాటలకు నా హృదయం ఉప్పొంగుతోంది‘ అని దర్శకుడు తన పోస్ట్‌లో రాసుకొచ్చారు. మార్చి 19న విడుదలైన 'ధురంధర్ 2' చరిత్ర సృష్టిస్తోంది. ప్రపంచవ్యాప్తంగా ఈ చిత్రం ఇప్పటికే రూ.750 కోట్ల మార్కును దాటి రికార్డులు తిరగరాస్తోంది. రజనీకాంత్‌తో పాటు అల్లు అర్జున్, మహేశ్ బాబు, నాగార్జున వంటి ఇతర అగ్ర తారలు కూడా ఈ సినిమాపై ప్రశంసలు కురిపించిన సంగతి తెలిసిందే.

Published and Owned By Katta Hima Pavani Published at H.No:4-8-301/34SP, Sathya Nagar Colony, Hayath Nagar, Ranga Reddy, Telangana-501505. Printed at Smilys Online 6-7-48, Vanasthalipuram Shopping Complex, Ranga Reddy District, Telangana-500070, Editor: Katta Hima Pavani, PRGI NO: TGTEL/25/A0471, Phone: 94920 33365